సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
ఆదివారం, 20.09.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 320
పేజీలు: 08 వెల: రూ. 5

## జన్వాడ ఫామ్ హౌస్‌పై రగడ

- జన్వాడ ఫామ్ హౌస్‌పై హైడ్రాకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు
- నాలాపై నిర్మాణం జరిగిందంటూ కాంగ్రెస్ విమర్శలు
- జన్వాడలో ఉద్రిక్తత.. బీఆర్ఎస్ కార్యకర్తల అడ్డగింత
- భూములు, నిర్మాణాలపై సమగ్ర విచారణకు డిమాండ్

02



# అప్పట్లో ఈటల ఇప్పుడు కేసీఆర్!

### కాలం మహా చిత్రమైందంటున్న రాజకీయ వర్గాలు.. అసైన్డ్ భూముల వివాదంలో మరోసారి గతం చర్చ

- ఈటల ఎపిసోడ్ గుర్తు చేస్తున్న ఎర్రవల్లి భూముల వివాదం
- నాడు కేసీఆర్ చర్యలు.. నేడు రేవంత్ దూకుడు
- అసైన్ భూముల ఆరోపణలు.. మరోసారి తెరపైకి పాత జ్ఞాపకాలు
- ఈటలపై నాడు.. కేసీఆర్‌పై నేడు భూవివాదం
- ఎర్రవల్లి భూములపై రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక ఫోకస్
- కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రెవెన్యూ అధికారుల హడావుడి
- కాలం మారింది.. పాత్రలు మారాయి.. సీన్ మాత్రం అదే!



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాజకీయాల్లో అప్పటి పరిణామాలు.. ఇప్పటి ఘటనలకు పోలికలు కనిపిస్తున్నాయన్న చర్చ మొదలైంది. 2021లో అప్పటి మంత్రి ఈటల రాజేందర్‌పై అసైన్డ్ భూముల ఆక్రమణ ఆరోపణల నేపథ్యంలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వం విచారణకు ఆదేశించడం, అనంతరం ఈటలను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయడం రాజకీయంగా సంచలనం సృష్టించింది. తాజాగా మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు, ఆ తర్వాత రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన నేపథ్యంలో అప్పటి ఘటనను పలువురు గుర్తు చేస్తున్నారు.

**ఈటలపై అప్పట్లో..**

2021 ఏప్రిల్–మేలో ఈటల రాజేందర్ కుటుంబానికి చెందిన జమునా హ్యాచరీస్‌కు సంబంధించి అసైన్డ్ భూముల ఆక్రమణ ఆరోపణలు తెరపైకి వచ్చాయి. మెదక్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టగా, భూముల వినియోగంపై నివేదికలు సమర్పించారు. దేవరయాంజల్ ఆలయ భూములకు సంబంధించిన ఆరోపణలపైనా ఉన్నతస్థాయి కమిటీ విచారణ జరిపింది. ఈ ఆరోపణలను ఈటల దంపతులు ఖండిస్తూ, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఈటలను కేసీఆర్ మంత్రి వర్గం నుంచి తొలగించారు.

**ఇప్పుడు కేసీఆర్ భూములపై..**

తాజాగా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ ఫామ్‌హౌస్ దాదాపు 700 ఎకరాల మేర విస్తరించి ఉందని, అందులో సుమారు 388 మిగతా 02లో

## కవిత వర్సెస్ జనసేన

### Xలో ముదిరిన మాటల యుద్ధం!

- పవన్‌పై కవిత పార్టీ ఘాటు విమర్శలు
- కవితపై జనసేన సంచలన ప్రశ్నలు
- ఆస్తులపై ఇరు పార్టీల పరస్పర ఆరోపణలు



- సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా రాజకీయ రగడ
- పవన్ అభిమానుల కౌంటర్ అటాక్
- ముదురుతున్న జనసేన–కవిత వర్గాల వార్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. రాజకీయ పార్టీల మధ్య విమర్శలు.. ప్రతి విమర్శలు సాధారణమే అయినప్పటికీ.. సోషల్ మీడియా వేదికగా నేతలు, పార్టీల అధికారిక ఖాతాల మధ్య జరుగుతున్న వార్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా కల్వకుంట్ల కవితకు చెందిన తెలంగాణ రక్షణ సమితి, జనసేన తెలంగాణ విభాగం మధ్య 'ఎక్స్'లో మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరింది. ఈ క్రమంలో ఇరు పార్టీల నేతలు.. ముఖ్యంగా పవన్ కల్యాణ్, కవితపై పరస్పరం వ్యాఖ్యలు చేసుకున్నారు.
ఈ వివాదానికి తెలంగాణ రక్షణ సమితి చేసిన ఓ సోషల్ మీడియా పోస్టు కారణమైంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశిస్తూ ఆ పార్టీ ఓ వీడియో క్లిప్‌ను షేర్ చేసి వ్యంగ్యంగా విమర్శించింది. అనంతరం హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్‌కు సంబంధించిన భూమి చెరువు పరిధిలో ఉందంటూ ఆరోపణలు చేసింది. చెరువు భూమిని ఆక్రమించి కంచె వేసినంత మాత్రాన అది సొంత భూమి కాదంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది.
అంతేకాకుండా.. ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించిన ఆస్తులకు మించి తన వద్ద ఒక్క గజం భూమి ఉన్నట్లు తేలినా ప్రభుత్వానికి అప్పగిస్తానని తమ నాయకురాలు స్పష్టంగా చెప్పారని తెలంగాణ రక్షణ సమితి తన పోస్టులో పేర్కొంది. వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడితే ఇబ్బందుల్లో పడతారంటూ జనసేనను మిగతా 02లో



## మహిళపై కానిస్టేబుల్ దాష్టీకం

02 హఫీజ్‌పేట్‌లో దారుణం

- మహిళను కొట్టి, జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లిన కానిస్టేబుల్
- భర్త, కూతురు వేడుకున్నా వినని కానిస్టేబుల్
- మహిళను కొట్టి వాహనం వద్దకు ఈడ్చుకెళ్లిన వైనం
- పోలీసుల తీరుపై కేటీఆర్ ఆగ్రహం.. డీజీపీకి ట్యాగ్

## ఎర్రవల్లి భూముల సర్వేలో కొత్త ట్విస్ట్

సర్వే నం. 325పై వెంకటాపూర్ గ్రామస్తుల అభ్యంతరం

388 ఎకరాల భూములపై కొనసాగుతున్న సర్వే



- 180 ఎకరాలు తమవేనంటున్న వెంకటాపూర్ వాసులు
- ఖాస్రా, సేత్వార్ రికార్డులతో సర్వే చేయాలని డిమాండ్
- సంబంధిత రైతులకు సోమవారం నోటీసులు?

02

## నా జీవితం ధన్యమైంది

### విశాఖలో చంద్రబాబు ఎమోషనల్



- విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని భరోసా
- విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన

03



## సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

ఎస్ఎల్‌పీ దాఖలు చేసిన ఎమ్మెల్యే 02

- అనర్హత వేటును సుప్రీంలో సవాలు చేసిన దానం
- దానం పిటిషన్‌పై కేవియట్లు దాఖలు

## సింగరేణి కుటుంబాలకు తీపి కబురు

### ఇళ్ల స్థలాలపై మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు

- 45 రోజుల్లో దరఖాస్తుల పరిష్కారం
- ప్రతి జిల్లాలో త్రిసభ్య కమిటీలు
- అర్హులకు చట్టబద్ధ హక్కులు
- జీవో 76 ప్రకారం పరిశీలన
- హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు

03



## వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు ఏం పేరు పెడదాం?

'x' వేదికగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



- రాణి రుద్రమ పేరు వైపే మొగ్గు
- 59.2% ఓట్లతో టాప్‌లో రుద్రమ

02

## బంగ్లాదేశ్‌కు స్మగ్లింగ్

- పశువుల దొంగల నుంచి మొబైల్ దొంగలుగా ముఠా
- ఖమ్మం సోనోవిజన్ చోరీతో ముఠా గుట్టురట్టు
- ముంబయి మీదుగా బంగ్లాదేశ్‌కు ఫోన్ల తరలింపు
- 9 మంది అరెస్ట్.. రూ.22 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనార్

03



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సమగ్ర సమాచార పత్రిక ముద్రలో
పని చేయాలనుకునే
జర్నలిస్టులకు
ఇదే మా ఆహ్వానం..
జిల్లాల స్టాఫర్లు
నియోజకవర్గ ఆర్సీ ఇన్‌చార్జిలు
మండలాల వారీగా రిపోర్టర్లు
ఆసక్తి అర్హత ఉన్నవారు
ఈ నంబర్లలో సంప్రదించగలరు
99491 93555
90003 37676
VOICE FOR A BETTER SOCIETY

## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

### 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ

- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ
- చిన్న నగరాలకు విస్తరించడం శుభపరిణామం
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై మోదీ సూచన

02



ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 20.09.2026
www.mudranews.in | @mudranews



## పీచు పదార్థాలతో మలబద్ధకానికి చెక్



మలబద్ధకం సమస్య ఉన్నవారు పీచు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటితో పాటు తగినంత నీరు తాగడం వల్ల మల విసర్జన సులభమవుతుంది. రోజువారీ ఆహారంలో ఫైబర్ పెంచడం పేగుల ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుంది.

# జన్వాడ ఫామ్ హౌస్‌పై రగడ

**ముద్ర, రంగారెడ్డి :**
రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ ఫాంహౌస్‌పై కాంగ్రెస్ ఎంపీలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫాంహౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా నాలాపైనే ఈ ఫాం హౌస్ నిర్మించారని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఆరోపించారు. శనివారం నాడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం బస్సు యాత్ర చేపట్టి జన్వాడ ఫాంహౌస్‌కు చేరుకుని అక్కడి భూములను, నిర్మాణాలను పరిశీలించేందుకు ప్రయత్నించింది. బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తమ బృందం ఫాంహౌస్ దగ్గరకు వస్తే కేసులు పెడతామని యజమానిగా చెప్పుకుంటున్న ప్రదీప్‌రెడ్డి అనడం సరి కాదన్నారు. ఇన్ని ఎకరాల విస్తీర్ణంలో అసలు ఫాంహౌస్ ఎలా నిర్మించారో స్పష్టం చేయాలని, కేటీఆర్ స్నేహితుడైన ప్రదీప్‌రెడ్డికి అసలు ఈ ఫాంహౌస్ భూమి ఎలా వచ్చిందో విచారణ జరగాలన్నారు. గతంలో జన్వాడ ఫాంహౌస్ దృశ్యాల కోసం డ్రోన్ ఎగరవేస్తే రేవంత్‌రెడ్డిపై అక్రమంగా కేసులు పెట్టారని మండిపడ్డారు. కేటీఆర్ కేవలం అద్దెకు మాత్రమే ఉంటున్నారని ప్రదీప్ చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. కేటీఆర్ ఈ ఫామ్‌హౌస్‌ను లీజుకు తీసుకున్నట్లు చెబుతున్నప్పటికీ, తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం ఆ లీజ్ ఒప్పందంపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు.



గతంలో పురపాలక శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సత్యం రామలింగరాజుకు చెందిన భూముల్లోనే ఈ ఫాంహౌస్‌ను అక్రమంగా నిర్మించారని ఆరోపించారు. కేటీఆర్ సతీమణి శైలిమ పేరుతో పాటు ఆయన అత్తగారి పేరు మీద ఇక్కడ భూములు ఉన్నాయని ఆరోపించారు. ఈ భూములన్నీ శతబిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరు మీద ఉన్నాయని, అసలు సూత్రధారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.
ఫామ్‌హౌస్ నిర్మాణం, నాలా ఆక్రమణలకు సంబంధించిన వివరాలపై ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో ఫోన్‌లో చర్చించారు. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్మాణాలు ఉన్నట్లు తేలినా వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.
ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను, నిజాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలనే జన్వాడ ఫాంహౌస్ పరిశీలనకు వచ్చామన్నారు. ఈ ఫాంహౌస్‌ను నాలా ఆక్రమించి నిర్మించారని, అసలు ఇది ఎవరి పేరు మీద ఉందో స్పష్టత లేదన్నారు.
కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లోని ప్రజా భవన్ నుంచి జన్వాడకు వెళ్లారు. అక్కడ ఉన్న భూముల రికార్డులు, యాజమాన్య వివరాలు, భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను క్షేత్రస్థాయిలో పరిశీలించడమే తమ పర్యటన ఉద్దేశమని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ఈ పర్యటన నేపథ్యంలో ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఇది ప్రైవేట్ ఆస్తి అని, అనుమతి లేకుండా లోపలికి ప్రవేశించరాదంటూ ఫామ్‌హౌస్ వద్ద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

# మహిళపై కానిస్టేబుల్ దాష్టీకం

**ముద్ర, హైదరాబాద్:**
హఫీజ్‌పేట రైల్వే స్టేషన్ పరిధిలో అమానుష ఘటన చోటుచేసుకుంది. మియాపూర్–హఫీజ్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలో ఒక మహిళను రైల్వే పోలీస్ కానిస్టేబుల్ విచక్షణారహితంగా కొట్టడమే కాకుండా, ఆమె జుట్టును పట్టుకొని నేలపై ఈడ్చుకుంటూ వెళ్లడం గమనార్హం. అయితే మహిళను కొట్టడం వెనుక కారణాలు ఏంటనే దానిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే సదరు మహిళను రైల్వే కానిస్టేబుల్ ఈడ్చుకెళుతున్న సమయంలో భర్త, కూతురు ఆమెను వదిలేయాలంటూ కానిస్టేబుల్‌ను వేడుకున్నారు. కానీ మాట వినిపించుకోని కానిస్టేబుల్ వాళ్లను నెట్టివేసి ఆమెను తన వాహనం వద్దకు ఈడ్చుకెళ్లాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇక, ఈ ఘటనకు సంబంధించిన వీడియోపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. తెలంగాణ పోలీసుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. 'ఇది తెలంగాణ పోలీసుల దారుణ ప్రవర్తన. మీరు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను' అంటూ తెలంగాణ డీజీపీని ట్యాగ్ చేశారు.



# కవిత వర్సెస్ జనసేన..

(మొదటి పేజీ తరువాయి)
ఉద్దేశించి వ్యాఖ్యానించింది. దీనికి జనసేన తెలంగాణ విభాగం కూడా అదే స్థాయిలో స్పందించింది. కవిత ఆస్తులపై ప్రశ్నలు సంధిస్తూ 'మీకు కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయి?' అంటూ పోస్టు చేసింది. గతంలో బ్యూటీ పార్లర్ నిర్వహించిన కవితకు కోట్ల రూపాయల ఆస్తులు ఎలా సమకూరాయంటూ ప్రశ్నించింది. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో సంపాదించారా? ఎంపీగా ఉన్నప్పుడు సంపాదించారా? తెలంగాణ జాగృతి పేరుతో ఎన్నారైలు, కంపెనీలను బెదిరించి డబ్బులు వసూలు చేశారా? అంటూ పలు ఆరోపణలు చేసింది.
అదే సమయంలో నిజామాబాద్ రైతుల సమస్యను కూడా జనసేన ప్రస్తావించింది. కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ సంపదను దోచుకుందని ఆరోపిస్తూ.. కవిత కొత్త రాజకీయ డ్రామాకు తెరతీశారని విమర్శించింది. ఈ వ్యాఖ్యలకు అనుకూలంగా జనసేన తెలంగాణ తన పోస్టులో ఘాటు హ్యాష్‌ట్యాగ్‌లను కూడా ఉపయోగించింది.
ఇరు పార్టీల అధికారిక సోషల్ మీడియా ఖాతాల మధ్య మొదలైన ఈ వివాదం ఇప్పుడు ఆయా పార్టీల అభిమానుల మధ్యకు కూడా చేరింది. పవన్ కల్యాణ్ అభిమానులు, కవిత మద్దతుదారులు పరస్పరం పోస్టులు, కామెంట్లతో స్పందిస్తున్నారు. దీంతో సోషల్ మీడియాలో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది.
అయితే.. ఇరు పార్టీలూ చేసిన భూవివాదం, ఆస్తులకు సంబంధించిన ఆరోపణలు ప్రస్తుతం రాజకీయ ఆరోపణలుగానే ఉన్నాయి. వాటిపై అధికారికంగా నిర్ధారిత ఆధారాలు లేదా తుది నిర్ణయాలు ఉన్నాయా అన్నది వేరుగా పరిశీలించాల్సిన అంశం. మొత్తంగా చూస్తే తెలంగాణ రాజకీయాల్లో జనసేన–కవిత వర్గాల మధ్య సోషల్ మీడియా వేదికగా మొదలైన ఈ వివాదం మరింత ముదిరే పరిస్థితి కనిపిస్తోంది.




# ఎర్రవల్లి భూముల సర్వేలో కొత్త ట్విస్ట్




**ముద్ర, మెదక్ :**
తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి భూముల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఎర్రవల్లిలోని 325 సర్వే నంబర్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను సేకరించేందుకు అధికారులు వరుసగా మూడో రోజు సర్వే కొనసాగించారు. శనివారం రెవెన్యూ, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ అధికారులు భూములను పరిశీలించారు. అయితే ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల సర్వే తాజాగా మరో మలుపు తిరిగింది. 325 సర్వే నంబర్‌లోని 388 ఎకరాల్లో 180 ఎకరాలు తమ గ్రామానికి చెందినవేనని వెంకటాపూర్ గ్రామస్థులు ఆరోపించడం హాట్ టాపిక్‌గా మారింది.
వెంకటాపూర్, వరదరాజుపూర్, ఎర్రవల్లి గ్రామాల పరిధిలో ఉన్న 325 సర్వే నంబర్‌లోని మొత్తం 388 ఎకరాల భూముల్లో 250 ఎకరాలు మాత్రమే ఎర్రవల్లి గ్రామానికి చెందినవని.. మిగతా 180 ఎకరాలు వెంకటాపూర్ గ్రామానికి చెందినవని చెబుతున్నారు. 80 ఎకరాలను గతంలో బలవంతంగా ఎర్రవల్లి గ్రామానికి సంబంధించిన సర్వే నంబర్‌గా చూపించారని ఆరోపించారు. అధికారులు చేసిన ఈ తప్పిదం వల్ల తాము నష్టపోవాల్సి వస్తోందని అందువల్ల ఖాస్రా, సేత్వార్ రికార్డుల ప్రకారం సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 325 సర్వే నంబర్ నుంచి తమ భూములను తొలగించి, వెంకటాపూర్ గ్రామానికి చెందిన భూములుగా పరిగణించాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు సంబంధించిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ ఇప్పటికే రాజకీయంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. వెంకటాపూర్ గ్రామస్తులు కొత్త డిమాండ్ తెరమీదకు తీసుకురావడంతో ఈ అంశం ఎలాంటి మలుపు తిరుగుతుందో చూడాలి.
325లోని ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించేందుకు ఇవాళ 3 బృందాలుగా సర్వే కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇవాళ సాయంత్రం వరకు ఈ సర్వే పూర్తయ్యే అవకాశం ఉందని, సంబధిత రైతులకు ఇచ్చేందుకు తహశీల్దార్ కార్యాలయంలో నోటీసులు సిద్ధం చేస్తున్నారని ఇవాళ సాయంత్రం లేదా సోమవారం నోటీసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నోటీసులు అందిన తర్వాతే క్షేత్రస్థాయిలో ప్రస్తుతం భూమిని ఎవరైతే సాగు చేసుకుంటున్నారో ఎవరు అనుభవిస్తున్నారో (Actual Cultivator/Possessor) వారిని గుర్తించే ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రక్రియ చేపడతామన్నారు.

# వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు ఏం పేరు పెడదాం..?

**ముద్ర, వరంగల్ :**
వరంగల్ ప్రజల దశాబ్దాల కల అయిన మామునూరు విమానాశ్రయం త్వరలోనే సాకారం కాబోతోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విమానాశ్రయ విస్తరణకు అవసరమైన భూసేకరణ పూర్తిచేసి, భూములను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించినట్లు ఎక్స్‌లో వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు కోసం రూ. 295 కోట్లు కేటాయించిందని, విమానాశ్రయం పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త ముఖద్వారంగా మారుతుందని పేర్కొన్నారు. అలాగే విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలో ప్రజలు సూచించాలని కోరారు.

**రాణి రుద్రమ పేరుకే ప్రజల మొగ్గు**
సీఎం ట్వీట్‌కు స్పందించిన తెలంగాణ కాంగ్రెస్ అధికారిక ఎక్స్ ఖాతా నాలుగు పేర్లతో పోల్ నిర్వహించింది. ప్రొఫెసర్ జయశంకర్, రాణి రుద్రమ, సమ్మక్క సారక్క, చాకలి ఐలమ్మ పేర్లను ఆప్షన్లుగా ఇచ్చింది. పోస్ట్ చేసిన గంటలోనే 59.2 శాతం ఓట్లతో రాణి రుద్రమ పేరు మొదటి స్థానంలో నిలిచింది. ప్రొఫెసర్ జయశంకర్‌కు 17.9%, సమ్మక్క సారక్కకు 17.3%, చాకలి ఐలమ్మకు 5.6% ఓట్లు వచ్చాయి. ప్రభుత్వం ఎలాంటి పేరు ఖరారు చేస్తుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

# అప్పట్లో ఈటల.. ఇప్పుడు కేసీఆర్!

(మొదటి పేజీ తరువాయి)
ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉన్నాయంటూ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఎర్రవల్లి, వెంకటాపురం, వరదరాజుపురం ప్రాంతాల్లోని భూముల రికార్డులను పరిశీలిస్తున్నారు.

**సర్వే నంబర్ 325పై ఫోకస్**
ప్రత్యేకంగా ఎర్రవల్లి పరిధిలోని సర్వే నంబర్ 325పై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. భూముల కొలతలు, సరిహద్దులు, రికార్డుల ఆధారంగా ప్రస్తుత స్థితిగతులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో కొలతలు చేపట్టే ప్రయత్నంలో స్థానిక రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం.

**కాలం మహా చిత్రమైందా?**
ఒకప్పుడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ తన మంత్రివర్గ సహచరుడు ఈటల రాజేందర్‌పై వచ్చిన భూఆరోపణలపై విచారణకు ఆదేశించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ భూములపై ఆరోపణలు చేస్తూ అధికార యంత్రాంగాన్ని రంగంలోకి దించారు. ఈ రెండు పరిణామాలను పోల్చుతూ "అప్పట్లో ఈటల.. ఇప్పుడు కేసీఆర్" అంటూ రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే, తాజా ఎర్రవల్లి భూముల వ్యవహారంలో ఆరోపణలు, అధికారుల విచారణలో తేలే వాస్తవాలు వేర్వేరు అంశాలుగా చూడాల్సి ఉంది.

# గూఢచర్యం చేసుకుంటాం

**ముద్ర, ఢిల్లీ :**
చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో సతీసమేతంగా అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా–అమెరికా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. అదే సమయంలో ఇరుదేశాలూ పరస్పరం గూఢచర్యం చేసుకుంటాయని పేర్కొన్నారు. గతంలో తమ అధికారి ఒకరు మాట్లాడుతూ.. అగ్రరాజ్యంపై చైనా గూఢచర్యం (Spy) చేస్తోందని చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. అయితే తాము కూడా బీజింగ్ విషయంలో అదే పని చేస్తుండడంతో దాన్ని అంతగా పట్టించుకోలేదని తెలిపారు.
"జిన్‌పింగ్ వచ్చే వారం అమెరికాకు వస్తారు. ఇతర దేశాలతో సంబంధాలు అంత బాగా లేకపోయినా.. మాకు చైనాతో మంచి అనుబంధం ఉంది. ఆయనతో సమావేశానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ఆ చర్చల్లో పలు కీలక ఒప్పందాలు చేసుకోబోతున్నాం. ప్రతి ఒప్పందం వెనక ఓ స్పష్టమైన ఉద్దేశం ఉంటుంది'' అని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

**ముద్ర, ఢిల్లీ :**
దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. 'భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది' అని వివరించారు.
చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు.
'ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి' అని తెలిపారు.
ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. 'మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి' అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకు 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'iGOT కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.



# సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం

**ముద్ర, హైదరాబాద్:**
హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. ఇవాళ మధ్యాహ్నం సుప్రీంకోర్టులో దానం పిటిషన్ దాఖలు చేసినట్టు సమాచారం. ఇదే కేసులో ఇప్పటికే భాజపా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కేవియట్ దాఖలు చేశారు.
బీఆర్ఎఫ్ తరఫున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై హై కోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది.




ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌లను కొట్టివేస్తూ స్పీకర్ వెలువరించిన తీర్పులను రద్దు చేస్తూ హైకోర్టు 91 పేజీల తీర్పు వెలువరించింది. స్పీకర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ భారాస, భాజపాలు దాఖలు చేసిన పిటిషన్‌లను అనుమతించింది. భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూలు పేరా 2(1)(ఎ) రెడ్‌విత్ 191(2) ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 20.09.2026
www.mudranews.in | @mudranews



## తగినంత నీరు తప్పనిసరి

శరీరంలో నీటి శాతం తగ్గితే మలబద్ధకం, జీర్ణకోశ సమస్యలు మరింత ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. రోజంతా తగినంత నీరు తాగడం ద్వారా శరీరానికి అవసరమైన ద్రవాలు అందుతాయి. ముఖ్యంగా ఫైబర్ ఎక్కువగా తీసుకునే వారు నీటి విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు.



## ఘనంగాఎల్బీ స్టేడియం "ఖేలో గణేశా "నిమజ్జనం

**ముద్ర, హైదరాబాద్** : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'ఖేలో గణేశా' వినాయకుడి నిమజ్జన కార్యక్రమం శనివారం ఉద్యోగుల సందడి, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, కోచ్ లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందోత్సవాల మధ్య వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వినాయకుడి లడ్డు వేలం పాటలో ఉద్యోగి వెంకటేష్ ₹41,116లకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, కోచ్ లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఎస్

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. కోర్ అర్బన్ రీజియన్‌లోని మున్సిపల్ కార్పొరేషన్లు, పోలీసు అధికారులతో వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు, డ్రైనేజీలను నిరంతరం పర్యవేక్షించాలని, నీరు నిలిచిన చోట డ్రైనేజీలను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించాలని ఆదేశించారు. హైదరాబాద్ సహా రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి తదితర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## కోదాడలో కొలువుల జాతర

**ముద్ర, కోదాడ** : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో కోదాడలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాకు యువత నుంచి భారీ స్పందన లభించింది. తొలి రెండు గంటల్లోనే 700 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపిక కాగా, అభ్యర్థులకు కంపెనీలు అక్కడికక్కడే ఆఫర్ లెటర్లు అందజేశాయి. మొత్తం 30 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్లు చేసుకోగా, ఐటీ, ఫార్మా, తయారీ, వైద్యం, బ్యాంకింగ్, రిటైల్ తదితర రంగాలకు చెందిన 350 కంపెనీలు నియామకాలకు ముందుకొచ్చాయి. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించిన మేళాలో స్క్రీనింగ్, ఇంటర్వ్యూల అనంతరం అర్హులైన వారిని ఎంపిక చేశారు. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కంపెనీల స్టాళ్లను సందర్శించి నియామక ప్రక్రియను పరిశీలించారు.

## కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది కుట్రపూరిత ప్రచారం



**ముద్ర, హైదరాబాద్**: రాష్ట్రంలో నెలకొన్న కరువు ప్రకృతి కారణంగా వచ్చింది కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం వల్లే ఏర్పడిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. కళ్లెదుట నీళ్లున్నా కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అన్నారం, సుందిల్ల బ్యారేజీలు సురక్షితమని కేంద్ర సంస్థలు తేల్చినా ప్రభుత్వం ప్రజలపై పగ సాధిస్తోందన్నారు. 3,300 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి రాష్ట్రాన్ని మళ్లీ డీజిల్ మోటార్ల కాలానికి తీసుకెళ్లారని మండిపడ్డారు. కాళేశ్వరంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, కొడంగల్ ప్రాజెక్టు అంచనాలు ఐదు రెట్లు ఎలా పెరిగాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం కుట్రపూరిత చర్యగా అభివర్ణించారు.

## తెలంగాణ యువతకు భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలు

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ యువతను ఆధునిక సాంకేతిక రంగాల్లో ఉద్యోగాలకు సిద్ధం చేసేందుకు TASK, Dell Technologies కలిసి 'uDaan' కార్యక్రమాన్ని అమలు చేయనున్నాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో TASK, Dell Technologies మధ్య MoU కుదిరింది. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలోని 25 కేంద్రాల్లో 5,500 మంది విద్యార్థులకు మూడు నెలలపాటు AI, క్లౌడ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ తయారీ, డిజిటల్ నైపుణ్యాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా అవకాశాలు కల్పించనున్నారు. IIT ఢిల్లీ రూపొందించిన పాఠ్య ప్రణాళికతో శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగాలు, అప్రెంటిస్‌షిప్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవకాశాలతో అనుసంధానం చేయనున్నారు.

## ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు 'SHT' వ్యూహం

**65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు**

**ముద్ర, హైదరాబాద్:** 2026–27 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న పౌర సరఫరాల శాఖ, అక్టోబర్ మొదటి వారంలో కొనుగోళ్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం స్టోరేజ్, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ (SHT) విధానాన్ని అమలు చేస్తోంది. ధాన్యం నిల్వ, తరలింపు, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. పౌర సరఫరాల కమిషనర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం. స్టీఫెన్ రవీంద్ర జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. TGSWC ఎండీ కొర్ర లక్ష్మి తో పాటు జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు, జిల్లా మేనేజర్లు పాల్గొని క్షేత్రస్థాయి ఏర్పాట్లను వివరించారు. సాధారణ గోదాములతో పాటు మూతపడిన రైస్ మిల్లులు, ఇండస్ట్రియల్ షెడ్లు, ఏఎంసీ ఆవరణలు, ఫంక్షన్ హాళ్లను కూడా ధాన్యం నిల్వకు వినియోగించేలా చర్యలు చేపట్టారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేయడంతో పాటు CAP విధానంలోనూ నిల్వకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ధాన్యం తరలింపులో అక్రమాలను అరికట్టేందుకు ప్రతి వాహనానికి GPS ఆధారిత VLTS ట్రాకింగ్ తప్పనిసరి చేశారు. అలాగే మిల్లుల్లో ఆకస్మిక తనిఖీల కోసం ఫిజికల్ వెరిఫికేషన్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. నకిలీ రశీదులు, ఫేక్ షీట్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో మాయిశ్చర్ మీటర్లు, క్లీనర్లు, డ్రయ్యర్లను సిద్ధంగా ఉంచుతున్నారు. హమాలీల కొరత లేకుండా ఇతర శాఖలతో సమన్వయం చేస్తున్నారు.

# బంగ్లాదేశ్‌కు దొంగిలించిన మొబైల్ ఫోన్లు సప్లై చేసే ముఠా అరెస్ట్..

**వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనార్**



**ముద్ర, హైదరాబాద్ :** పశువుల చోరీల నుంచి మొబైల్ షాప్‌ల లూటీకి రూటు మార్చిన ముఠాను శనివారం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ఖమ్మం పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. బంజారాహిల్స్ టీజీఐసీసీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సజ్జనార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. లంగర్ హౌస్ ప్రాంతానికి చెందిన మహ్మద్ తబ్రేజ్, మహ్మద్ రఫీక్‌లు రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో పశువుల దొంగతనాలు చేస్తు వాటిని విక్రయించి డబ్బులు సంపాదించుకుంటున్నారు. దీనికోసం జుబేర్ అక్తర్, నవీద్, సాయి రెడ్డిలతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. పశువులను ఎత్తుకెళ్లే సమయంలో అవి అరవకుండా ఉండేందుకు జైలా జైన్ మత్తు ఇంజక్షన్‌ను ఇచ్చేవారు. ఇలా ఈ ముఠా నాగర్ కర్నూలు, మహబూబ్‌నగర్, నల్గొండ, ఫ్యూచర్ సిటీ ప్రాంతాల్లో మొత్తం 13 నేరాలకు పాల్పడి పశువులను ఎత్తుకెళ్లిపోయారు. ఈ ముఠాకు పశువులను దొంగతనం చేసే సమయంలో వాహనాలను చంచల్ గూడ జైలు లో పరిచయమైన అబూ సమకూర్చేవాడు. వీరు పశువు దొంగతనాలు సమయంలో ఇన్నోవా క్రిస్టా, ఇన్నోవా, ఎర్టిగా తదితర వాహనాలు ఉపయోగించారు.ఈ ముఠా రంజాన్, బక్రీద్ పండుగల తర్వాత పశువుల కొనుగోలుకు డిమాండ్ తగ్గడంతో ఇతర చోరీల పై దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో తబ్రేజ్ తన పాత అనుచరుడు ఫరహాన్‌ను సంప్రదించాడు. అతను మొబైల్ ఫోన్‌ల షాప్‌లను టార్గెట్ చేసి ఫోన్‌లను చోరీ చేస్తే వాటిని కొనుగొలు చేసే ముఠాలు తనకు టచ్ లో ఉన్నారని చెప్పాడు.

**విజయవాడ బిగ్ సీలో అటెంప్ట్, ఖమ్మం సోనోవిజన్‌లో సక్సెస్**

తబ్రేజ్ ముఠా ముందుగా విజయవాడలోని బిగ్ సీ దుకాణంలో చోరీకి యత్నించారు. ఆ అటెంప్ట్ ఫెయిల్ అయ్యింది. జూన్ 11వ తేదీన ఖమ్మం సోనోవిజన్ దుకాణంలో చోరీకి పాల్పడి భారీగా సెల్ ఫోన్లు చోరీ చేశారు. వాటిని ఫరహాన్ సహాయంతో ముంబాయికి చెందిన మెహబూబ్ షేక్, ముబీన్ షేక్ ద్వారా 20 లక్షలకు వాటిని అమ్మేశారు. వచ్చిన డబ్బును ముఠాలోని అందరూ పంచుకున్నారు.ఖమ్మం పోలీసులు వారి కోసం గాలిస్తున్నారని తెలుసుకున్న తబ్రేజ్ ముఠా తమ మకాంను హైదరాబాద్ నుంచి ముంబయికి మార్చారు. ఆ తర్వాత మధ్యప్రదేశ్ ఉజ్జయినీలో రెండు మొబైల్ షాపులలో చోరీకి పాల్పడి మొబైల్ ఫోన్‌లను ముంబయి ముఠాకు అమ్మేశారు. అక్కడి నుంచి గుజరాత్ లో మరో మొబైల్ షాపును టార్గెట్ చేశారు. అక్కడ రెక్కీ నిర్వహిస్తున్న సమయంలో పోలీసు పెట్రోలింగ్ రావడంతో వారి నుంచి తప్పించుకునే క్రమంలో ముఠా రోడ్డు ప్రమాదానికి గురైంది. ముఠాలోని కొందరికి గాయాలు కావడంతో కారును అక్కడే వదిలేసి పారిపోయారు.

**ముంబయి నుంచి కోల్‌కత్తా సముద్ర మార్గంలో బంగ్లాదేశ్ కు ఫోన్ లు సరఫరా..**

ఈ ముఠాను విచారించినప్పుడు తబ్రేజ్ ముఠా నుంచి చోరీ చేసిన మొబైల్ ఫోన్ లను ముంబయి ముఠా కొనుగొలు చేసి వాటిని జాహేద్ ఖాన్ అలియాస్ రాజు భాయ్ తన అనుచరులు ద్వారా ముంబయి నుంచి కోల్ కత్తాకు పంపిస్తాడు. అక్కడి నుంచి వాటిని అక్రమంగా సముద్ర మార్గం ద్వారా బంగ్లాదేశ్ కు పంపించి అక్కడి నుంచి మొబైల్ ఫోన్ అంతర్జాతీయ మార్కెట్లో విక్రయిస్తున్నారని తేలింది. ఇలా జాహేద్ ఖాన్ కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మొబైల్ ఫోన్ దొంగల నుంచి కొంతకాలంగా మొబైల్ ఫోన్ లను కొనుగోలు చేసి వాటిని బంగ్లాదేశ్ కు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇలా ప్రతి నెల 500 మొబైల్ ఫోన్లు బంగ్లాదేశ్ కు తరలిస్తున్నారని పోలీసులు పసిగట్టారు. జాహేద్ నుంచి బంగ్లాదేశ్ ఢాకా కు చెందిన ఖాసీమ్ కొంటున్నారని పోలీసుల విచారణలో బయట పడింది.

**హైదరాబాద్‌కు వచ్చి దొరికిపోయారు..**

తబ్రేజ్ ముఠా తాజాగా ఇటీవల కొత్త వోక్స్ వ్యాగన్ కారులో హైదరాబాద్ కు వచ్చి మొబైల్ దుకాణంలో చోరీ చేసేందుకు తిరుగుతుండగా హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో 13 పశువుల దొంగతనాలు, విజయవాడ, ఖమ్మం, మధ్య ప్రదేశ్, గుజరాత్ మొబైల్ ఫోన్ దుకాణంలో జరిగిన చోరీ కేసుల మిస్టరీ వీడిపోయిందని సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ ముఠాను పట్టుకున్న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌తో పాటు, ఖమ్మం పోలీసులను సీపీ సజ్జనార్ అభినందించారు. 9 మంది నిందితుల నుంచి 22 లక్షల నగదు, 15 మొబైల్ ఫోన్లు, నాలుగు కారులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన మొబైల్ ఫోన్లు దేశం దాటి వెళ్లిపోవడంతో ఐఎంఈఐ నంబర్ల ద్వారా వాటిని గుర్తించడం కష్టంగా మారిందని పోలీసులు పేర్కొన్నారు.

## 22ఎ సమస్యలకు త్వరలో ముగింపు

**ముద్ర, హైదరాబాద్**: రాష్ట్రంలోని భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అసెంబ్లీ లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 12 అంశాలపై దశలవారీగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే కాలనీల క్రమబద్ధీకరణకు జీవో 118, సింగరేణి ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు జీవో 76 జారీ చేశామని వెల్లడించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం లోని 44 కాలనీల లబ్ధిదారులకు సరూర్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమం లో ధ్రువపత్రాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్‌తో కలిసి పొంగులేటి అందజేశారు. 22ఎలో ఉన్న భూములు, కాలనీల సమస్యల పరిష్కారంపై త్వరలో ప్రభుత్వం తీపికబురు చెబుతుందని తెలిపారు. మరో వారం రోజుల్లో ఆదేశాలు వెలువడే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్లు, దరఖాస్తు చేసుకోని వారి సమస్యలను కూడా పరిష్కరిస్తామని చెప్పారు.

# సింగరేణి కుటుంబాలకు తీపి కబురు..

**ఇళ్ల స్థలాలపై మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు**
**45 రోజుల్లో దరఖాస్తుల పరిష్కారం**
**ప్రతి జిల్లాలో త్రిసభ్య కమిటీలు**
**అర్హులకు చట్టబద్ధ హక్కులు**
**జీవో 76 ప్రకారం పరిశీలన**
**హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు**



**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కుటుంబాలు దశాబ్దాలుగా నివసిస్తున్న తమ ఇళ్ల స్థలాలపై హక్కు పత్రాల కోసం నిరీక్షిస్తున్నాయని, వారి సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికేలా చర్యలు చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సింగరేణి బొగ్గు బెల్ట్ ప్రాంతంలోని ఇళ్ల స్థలాల సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం చూపుతూ, అర్హులైన కుటుంబాలకు హక్కు కల్పించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. సింగరేణి కార్మికుల ఇండ్ల స్థలాల సమస్యపై శనివారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. జీవో 76 పరిగణనలోకి తీసుకొని, భూముల స్వభావం, ప్రభుత్వ/సింగరేణి హక్కులు, ప్రస్తుత నివాస పరిస్థితులు, చట్టపరమైన అంశాలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తున్నామ న్నారు. సింగరేణి బొగ్గు బెల్ట్ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కొమురం భీమ్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను హైకోర్టు ఆదేశాలకు లోబడి 45 రోజుల్లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి, జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా ఈ కమిటీలు పనిచేస్తాయని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఏవైనా అవకతవకలు లేదా నిబంధనలకు సంబంధించిన అంశాలు గుర్తిస్తే, అమలులో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం వాటిని సమీక్షించి తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. దశాబ్దాలుగా సింగరేణి ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న కుటుంబాలకు చట్టబద్ధమైన హక్కు కల్పించడం తమ ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరిగేలా నిబంధనల ప్రకారం ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

## 71,011 డీటీఆర్‌ల ఏర్పాటు



ముద్ర, హైదరాబాద్ : ప్రజాపాలనలో 32 నెలల కాలంలో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 71,011 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) ఏర్పాటు చేసినట్లు సంస్థ వెల్లడించింది. 2023 డిసెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు వీటి కోసం రూ.828.99 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపింది. పెరుగుతున్న వ్యవసాయ, గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ అవసరాలకు అనుగుణంగా డీటీఆర్‌ల ఏర్పాటు చేపట్టినట్లు పేర్కొంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గడంతో పాటు లో–వోల్టేజ్, ఓవర్‌లోడింగ్, తరచూ విద్యుత్ అంతరాయాల సమస్యలు తగ్గాయని తెలిపింది. భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు, సబ్‌స్టేషన్ల ఏర్పాటు, సామర్థ్య పెంపు పనులను వేగవంతం చేస్తామని వెల్లడించింది. విద్యుత్ ఫిర్యాదుల కోసం 24 గంటల టోల్‌ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని సూచించింది.

# నా జీవితం ధన్యమైంది..: సీఎం చంద్రబాబు

**ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను**
**విశాఖలో చంద్రబాబు ఎమోషనల్**
**విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ**
**మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని చంద్రబాబు భరోసా**
**విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన**
**గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ**
**గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు**



**ముద్ర, విశాఖపట్నం :** విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల సాకారమైంది. 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ కన్వీనియన్స్ డీడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేదల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకమని అన్నారు. "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. ఈ క్షణాన్ని నా ప్రాణం ఉన్నంతవరకు గుర్తుపెట్టుకుంటాను" అని భావోద్వేగానికి గురయ్యారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో ఇళ్లు నిర్మించుకున్నా పూర్తి హక్కులు లేక ఇబ్బందులు పడుతున్న వారికి ఈ పట్టాలతో శాశ్వత హక్కులు లభించాయని చంద్రబాబు తెలిపారు. గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా ప్రాంతాల్లో 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించి, రూ.8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని చెప్పారు. ఇకపై పట్టాల ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చన్నారు.

**మిగిలిన వారికీ త్వరలో పట్టాలు**

వివిధ కారణాలతో నిలిచిపోయిన 35 కాలనీల్లోని 10 వేల కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలో పట్టాలు అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ ను ఆదేశించారు. గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు విమర్శలు చేశారు. రాష్ట్రంలో భూకబ్జాలు, కూల్చివేతలతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని ఆరోపించారు. రుషికొండలో నిర్మించిన భవనాల నిర్వహణకు భారీగా ఖర్చవుతుందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం విధ్వంసం నుంచి వికాసం, భయం నుంచి భరోసా వైపు రాష్ట్రాన్ని నడిపిస్తోందన్నారు.

**విశాఖకు నీటి సమస్య ఉండదు**

విశాఖ భవిష్యత్తులో విశ్వనగరంగా ఎదగనుందని చంద్రబాబు అన్నారు. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, ఐటీ పరిశ్రమలతో పాటు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నగర అభివృద్ధికి దోహదపడతాయన్నారు. పోలవరం ఎడమ కాలువను విశాఖ వరకు పొడిగించి గోదావరి జలాలను తీసుకువచ్చి నగర నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 20.09.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com




# హైదరాబాద్ to అండమాన్

## ఐఆర్సీటీసీ సమ్మర్ స్పెషల్ ప్యాకేజ్




పర్యటనలు ఇష్టపడేవారు లైఫ్ లో ఒక్కసారైనా విజిట్ చేయాలనుకునే ప్రదేశం అండమాన్ నికోబార్ దీవులు. అండమాన్ దీవుల పేరు చెప్తే ముందుగా గుర్తొచ్చేవి దట్టమైన అడవులు. అయితే, అవి మాత్రమే కాదు. ఈ ప్రదేశం అందమైన దీవులకు నిలయం. మూడు వైపులా సముద్రం మధ్యలో దీవులు. వీటి గురించి వినడమే కానీ చాలా మంది ఇటువైపు వెళ్లే ప్లాన్ చేసి ఉండరు. అలాంటి వారి కోసమే ఐఆర్సీటీసీ అద్భుతమైన ప్యాకేజీతో మీ ముందుకొచ్చింది. హైదరాబద్‌లో ఫ్లైట్ ఎక్కితే నేరుగా అందమైన దీవుల్లో కాలుమోపేలా ప్లాన్ చేసింది. అక్కడి ఇసుక తిన్నెల్లో, సముద్ర తీరం మధ్యలో ఈ దీవులను చూస్తూ గడపడం చెప్పలేని అనుభూతిని పంచుతుంది.

వేసవి టూర్‌ను ఎంజాయ్ చేయాలనుకునే వారికోసం ఐఆర్సీటీసీ సరికొత్త ప్యాకేజీతో ముందుకు వచ్చింది. అమేజింగ్ అండమాన్ పేరుతో హైదరాబాద్ నుంచి టూర్ ప్లాన్ చేస్తోంది. ఈ ప్యాకేజీ మొత్తం 5 రాత్రులు, 6 పగళ్లు ఉండనుంది. టూర్ లో భాగంగా పోర్ట్ బ్లెయిర్, హేవ్‌లాక్ ఐలాండ్, నెయిల్ ఐలాండ్ తో పాటు అక్కడి ఫేమస్ పరిసరాలను కూడా చూసిరావచ్చు. హైదరాబాద్ నుంచి ఫ్లైట్ జర్నీ ద్వారా ఈ టూర్ కి వెళ్లి రావాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి టూర్ ఎప్పుడు మొదలవుతుంది, ప్యాకేజీ వివరాలు, ఎలాంటి సౌకర్యాలు ఉంటాయి అనే వివరాలు తెలుసుకుందాం.

**ప్యాకేజీ వివరాలు..**

హైదరాబాద్ నుంచి ఉదయం 06.35 గంటలకు హైదరాబాద్ విమానశ్రయం నుంచి టూర్ ప్రారంభం అవుతుంది.కంఫర్ట్‌లో సింగిల్ ఆక్యూపెన్సీకి రూ. 68,320, డబుల్ ఆక్యూపెన్సీకి రూ. 51,600, ట్రిపుల్ ఆక్యూపెన్సీకి రూ.49,960 చెల్లించాలి. 5 నుంచి 11 సంవత్సరాల చిన్నారులకు విత్ బెడ్ అయితే రూ.42,950 చెల్లించాలి. 2 నుంచి 11 సంవత్సరాల చిన్నారులకు విత్ అవుట్ బెడ్ అయితే రూ. 39,525 పే చేయాలి.

**ప్యాకేజీ ధర:**

సింగిల్ ఆక్యుపెన్సీకి రూ. 68,320, డబుల్ ఆక్యుపెన్సీకి వ్యక్తికి రూ. 51,600, ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.49,960 చెల్లించాల్సి ఉంటుంది.

5–11 సంవత్సరాల పిల్లలకు విత్ బెడ్ రూ.42,950.

2–11 సంవత్సరాల చిన్నారులకు విత్ అవుట్ బెడ్ రూ. 39,525.

**సదుపాయాలు:**

★ హైదరాబాద్ నుండి పోర్ట్ బ్లెయిర్‌కు విమాన ప్రయాణ ఛార్జీలు
★ 3 –స్టార్ హోటల్‌లో 5 రాత్రులు బస (పోర్ట్ బ్లెయిర్‌లో 2 రాత్రులు, హేవ్‌లాక్ ఐలాండ్‌లో 2 రాత్రులు, నీల్ ఐలాండ్‌లో 1 రాత్రి)
★ హోటల్‌లో అల్పాహారం, రాత్రి భోజనం వారే అందిస్తారు.
★ ఏసీ వాహనంలో అన్ని సందర్శనా స్థలాలు ప్రయాణ ఖర్చులతో సహా తిప్పి చూపుతారు.
★ అన్ని సందర్శనా స్థలాలకు ప్రవేశ రుసుములు, గైడ్ ఛార్జీలు వారివే ఉంటాయి.
★ పోర్ట్ బ్లెయిర్ నుండి హేవ్‌లాక్ ద్వీపం, నీల్ ద్వీపానికి ఫెర్రీ బదిలీలు.

**ప్యాకేజీలో లేని సౌకర్యాలు..**

భోజనం, స్నాక్స్, వాటర్ గేమ్స్, ఇతర వ్యక్తిగత ఖర్చులు లాండ్రీ, టిప్స్ ప్యాకేజీ ద్వారా లభించవు.

ఈ ప్యాకేజీ మార్చి 12వ తేదీన అందుబాటులోకి వచ్చింది.

శీతాకాలం ప్రారంభం అవుతుంది అనగానే తెలుగు రాష్ట్రాల ప్రజల మనస్సు ఆంధ్రా ఊటీ అరకు మీద పడుతుంది. ఇప్పుడిప్పుడే అరకు అందాలను చూసేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. విశాఖ ఏజెన్సీలోని అరకు అందాలు ప్రకృతి ప్రేమికులకు సహజ సౌందర్యంతో కనువిందు చేస్తున్నాయి. ప్రస్తుతం అరకు, పాడేరు, వంజంగి ప్రాంతాలలో పర్యాటకుల సందడి కనువిందు చేస్తుంది.

ఆంధ్రా ఊటీ!



# ఒక్క రోజులో హైదరాబాద్ టూర్



హైదరాబాద్ అంటే చారిత్రక కట్టడాలు, అద్భుతమైన కోటలు, రాజవంశాల ఆనవాళ్లు, పురాతన ప్యాలెస్‌లు, నోరూరించే బిర్యానీ.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు గుర్తుకొస్తాయి. నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ఒకే రోజులో చుట్టి రావాలనుకునేవారికి తెలంగాణ టూరిజం ప్రత్యేక ప్యాకేజీ అందిస్తోంది. తక్కువ ఖర్చుతో నగరంలోని ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించేలా రూపొందించిన ఈ టూర్‌లో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి, ఎక్కడెక్కడికి తీసుకెళ్తారు, టికెట్ ధరలు ఎంత తెలుసుకుందాం.

ఉదయం 7:30 గంటలకు సికింద్రాబాద్‌లోని బేగంపేట యాత్రి నివాస్ నుంచి టూర్ బయలుదేరుతుంది. 7:45 గంటలకు పర్యాటక భవన్ వద్ద బస్సు ఎక్కవచ్చు. 8:15 గంటలకు బషీర్‌బాగ్‌లోని CRO ఆఫీస్ వద్ద మరో బోర్డింగ్ పాయింట్ ఉంటుంది.

బషీర్‌బాగ్ నుంచి బయలుదేరిన అనంతరం మొదట బిర్లా మందిర్‌ను సందర్శిస్తారు. అక్కడి నుంచి చౌమహల్లా ప్యాలెస్, చార్మినార్, మక్కా మసీద్‌కు తీసుకెళ్తారు. అనంతరం లాడ్ బజార్‌లో షాపింగ్ చేసేందుకు కొంత సమయం కేటాయిస్తారు.

తర్వాత సాలార్‌జంగ్ మ్యూజియాన్ని సందర్శిస్తారు. అనంతరం లంచ్ బ్రేక్ ఉంటుంది. భోజనం పూర్తయ్యాక నిజాం మ్యూజియానికి వెళ్తారు. అక్కడి నుంచి గోల్కొండ కోటను వీక్షించే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత కుతుబ్ షాహీ టూంబ్స్ సందర్శన ఉంటుంది.

చివరగా ఐమ్యాక్స్, ఖైరతాబాద్ మీదుగా లుంబినీ పార్క్‌కు చేరుకుంటారు. రాత్రి 7:30 గంటల సమయంలో అక్కడ పర్యాటకులను దింపడంతో టూర్ ముగుస్తుంది.

**శుక్రవారం కొన్ని ప్రదేశాలకు నో ఎంట్రీ**

ఈ టూర్ ప్రతిరోజూ నిర్వహించినప్పటికీ శుక్రవారం కొన్ని మార్పులు ఉంటాయి. ఆ రోజు చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, నిజాం మ్యూజియం మూసి ఉంటాయి. దీంతో ఈ మూడు ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉండదు. వాటికి బదులుగా నెహ్రూ జూ లాజికల్ పార్క్‌కు తీసుకెళ్తారు.

**టికెట్ ధరలు..**

ఏసీ బస్సులో ప్రయాణించే పెద్దలకు రూ. 500, పిల్లలకు రూ.400గా టికెట్ ధర నిర్ణయించారు. నాన్ ఏసీ బస్సులో పెద్దలకు రూ.380, చిన్న పిల్లలకు రూ.300 చెల్లించాలి. అయితే భోజన ఖర్చులు, సందర్శించే ప్రాంతాల్లో ప్రవేశానికి అవసరమైన ఎంట్రీ టికెట్లను పర్యాటకులే చెల్లించుకోవాలి. టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం తెలంగాణ టూరిజం అందించిన లింక్‌ను పరిశీలించవచ్చు.




# బాదం లడ్డూ..

**కావలసినవి:**

| | |
|---|---|
| **బాదం పప్పు** | : కప్పు, |
| **ఎండు కొబ్బరి తురుము** | : కప్పు, |
| **బెల్లం తురుము** | : 3/4 కప్పు, |
| **ఏలకుల పొడి** | : 1/4 టీస్పూన్, |
| **నెయ్యి** | : 2 టేబుల్ స్పూన్లు, |
| **జీడిపప్పు** | : 10 (చిన్న ముక్కలుగా కట్ చేసినవి), |
| కిస్మిస్ | : 2 టేబుల్ స్పూన్లు |

**తయారీ:**

ముందుగా స్టవ్‌పై ఒక పాన్ పెట్టి, అందులో బాదం పప్పు వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి వచ్చే వరకు వేయించండి.

వేగిన పప్పులను పూర్తిగా చల్లారనిచ్చి, ఆ తర్వాత ఒక మిక్సీ జార్‌లోకి తీసుకుని మెత్తటి పొడిలా గ్రైండ్ చేసుకుని పక్కన పెట్టుకోండి.

ఇప్పుడు అదే పాన్ లో కప్పు ఎండు కొబ్బరి తురుము వేసి, అది కూడా గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చే వరకు దోరగా వేయించండి.

వేయించిన కొబ్బరి తురుమును మిక్సీ జార్‌లోకి తీసుకుని, దాంతో పాటు బెల్లం తురుము కూడా వేయండి.

దీనిని కూడా పల్స్ మోడ్‌లో కొద్దిగా బరకగా గ్రైండ్ చేసుకోండి.

ఈ కొబ్బరి–బెల్లం మిశ్రమాన్ని కూడా ముందే సిద్ధం చేసి పెట్టుకున్న బాదం పొడి ఉన్న గిన్నెలోనే వేసేయండి.

ఇందులోనే ఏలకుల పొడి వేసి, అన్ని పదార్థాలు బాగా కలిసేలా చేత్తో ఒకసారి కలుపుకోండి.

2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేసి 10 జీడిపప్పు ముక్కలు, కిస్మిస్ వేసి వేయించుకుని ముందుగా మనం సిద్ధం చేసుకున్న లడ్డూ మిశ్రమంలో కలపాలి.

ఇప్పుడు చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని, కొద్దికొద్దిగా మిశ్రమాన్ని తీసుకుంటూ మీకు నచ్చిన సైజులో లడ్డూలు చుట్టుకోండి.

ఎంతో టేస్టీ బాదం లడ్డూలు రెడీ! వీటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో భద్రపరచుకుంటే 2 వారాల పాటు ఫ్రెష్‌గా ఉంటాయి. రోజూ ఒకటి తింటే ఆరోగ్యానికి చాలా మంచిది.





## 5 పదార్థాలతో

# టమాటా పప్పు

**కావలసినవి:**

**కందిపప్పు:** 1 కప్పు (200 గ్రాములు)
**టమాటాలు:** 2 మధ్యస్థవి (సుమారు 250 గ్రాములు), ముక్కలుగా కోసినవి
**పచ్చిమిర్చి:** 3–4 (మీ కారానికి తగినట్లు), చీల్చినవి
**చింతపండు:** చిన్న నిమ్మకాయంత ముద్ద (లేదా 1–2 టీస్పూన్లు చింతపండు గుజ్జు)
**పసుపు:** 1/4 టీస్పూన్
**ఉప్పు:** రుచికి సరిపడా
**నీళ్లు:** 3 కప్పులు

**పోపు కోసం**

**నూనె:** 2 టేబుల్‌స్పూన్లు
**ఆవాలు:** 1/2 టీస్పూన్
**జీలకర్ర:** 1/2 టీస్పూన్
**ఎండుమిర్చి:** 2, తుంచినవి
**కరివేపాకు:** 1 రెబ్బ
**ఇంగువ:** చిటికెడు (ఐచ్ఛికం)

**తయారీ**

కందిపప్పును శుభ్రంగా కడిగి, 15 నిమిషాలు నీటిలో నానబెట్టండి.
కుక్కర్ తీసుకొని, నానబెట్టిన పప్పు, ముక్కలుగా కోసిన టమాటాలు, చీల్చిన పచ్చిమిర్చి, చింతపండు ముద్ద, పసుపు మరియు 3 కప్పుల నీళ్లు వేసి కలపండి.
కుక్కర్ మూత పెట్టి, మీడియం మంటపై 3–4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించండి. (లేదా పప్పు మెత్తగా ఉడికే వరకు).
కుక్కర్‌లో ఆవిరి పూర్తిగా పోయిన తర్వాత, మూత తీసి, పప్పును పప్పు గుత్తితో లేదా గరిటెతో మెత్తగా మెదపండి.
ఇప్పుడు రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపండి. మీకు కావలసిన పప్పు చిక్కదనానికి తగ్గట్టుగా మరికొన్ని వేడి నీళ్లు కలుపుకోవచ్చు.
చివరగా, పోపు సిద్ధం చేసుకోండి: ఒక చిన్న పాన్‌లో నూనె వేడి చేయండి. నూనె వేడయ్యాక, ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడనివ్వండి.
తరువాత ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసి, కరివేపాకు క్రిస్పీగా అయ్యే వరకు వేయించండి.
ఈ పోపును వెంటనే ఉడికించిన టమాటా పప్పులో వేసి బాగా కలపండి.
వేడివేడి టమాటా పప్పు అన్నం లేదా రోటీతో వడ్డించండి.

## వంటింటి చిట్కాలు

- కూరలో గ్రేవీ చిక్కగా రావాలంటే కొద్దిగా కొబ్బరి పాలు లేక పెరుగును కలపాలి.
- కూరలో నూనె ఎక్కువైతే రెండు బ్రెడ్ ముక్కలను పొడిలాగా చేసి కూరలో కలపాలి.
- దోశెలు కరకరలాడుతూ రావాలంటే మినపపప్పు నాన బెట్టేటపుడు ఓ గుప్పెడు కందిపప్పు, ఒక స్పూన్ మెంతులు కూడా కలపాలి.
- దోసెల పిండి మిక్సీలో కంటే వెట్ గ్రైండర్‌లో పట్టిస్తే దోసెలు కరకరలాడుతూ వస్తాయి.
- కూరలలో ఉప్పు ఎక్కువైతే ఒక టేబుల్ స్పూన్ బియ్యపు పిండిని నూనె లేకుండా వేయించి కూరలో కలపాలి లేదా ఉడికించి తోలు తీసిన చిన్న బంగాళా దుంప ముక్కను కూరలో కలపాలి.



సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

ఆదివారం 20.09.2026

www.mudranews.in | @mudranews




## సమయానికి భోజనం.. ఒత్తిడి తగ్గింపు



వేళకు తినకుండా ఎక్కువ సమయం ఖాళీ కడుపుతో ఉండటం, పని ఒత్తిడి, నిద్రలేమి వంటి జీవనశైలి అలవాట్లు జీర్ణకోశ సమస్యలను తీవ్రతరం చేయవచ్చు. క్రమబద్ధమైన భోజనం, తగినంత నిద్ర, ఒత్తిడి నియంత్రణతో జీర్ణ వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.

# ఘనంగా వినాయక నవరాత్రి వేడుకలు

**ముద్ర, కూకట్‌పల్లి :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలో నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను దర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన వసంత్ నగర్, కేపీహెచ్‌బీ 4వ ఫేజ్, కైతలాపూర్, రాఘవేంద్ర నగర్, ఆంజనేయ నగర్ మరియు మూసాపేట్ ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను సందర్శించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయా ఉత్సవ కమిటీలు నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు.అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ... విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**వివిధ కాలనీల్లో గణనాథుల వద్ద ప్రత్యేక పూజలు**

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం బాలకృష్ణ నగర్, సాయిబాబా నగర్ కాలనీ, ఆల్విన్ కాలనీ మరియు వివేకానంద నగర్ కాలనీల్లో కొలువుదీరిన గణనాథుల మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మండప నిర్వాహకుల ఆహ్వానం మేరకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ఆయా కాలనీలలోని గణనాథుల మండపాలను సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దివ్య దర్శనం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించడమే కాకుండా, వారితో కలిసి ప్రసాదం స్వీకరించారు.సేవా కార్యక్రమాలు అభినందనీయం:నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆయా కాలనీల మండప నిర్వాహకులను ఈ సందర్భంగా రాజేశ్వరరావు అభినందించారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మికతను పెంచడంతో పాటు సేవాభావాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసి, స్వయంగా అన్నప్రసాదం వడ్డించిన శ్రీ వడ్డేపల్లి రాజేశ్వరరావును మండప నిర్వాహకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక భక్తులు, మహిళలు, యువకులు, మండప నిర్వాహకులు, బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఘనంగా శ్రీ నారాయణీ ప్రత్యంగీరా హోమం

**మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రత్యేక పూజలు**

**ముద్ర, కీసర :** కీసర మండల పరిధిలోని చీర్యాల సాయి నగర్‌లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ నారాయణీ ప్రత్యంగీరా మహాదేవి హోమంలో మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కీసర క్షత్రియ యూత్,సునీల్ వర్మ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఈ ఆధ్యాత్మిక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సద్గురు శాంకరి అఘోరి మాతాజీ పర్యవేక్షణలో వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా హోమ క్రతువు సాగింది. సకల గ్రహదోషాలు, శత్రుపీడ నివారణతో పాటు లోక కల్యాణం, ప్రజలందరి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని కాంక్షిస్తూ ఎండు మిరపకాయలతో ఈ విశేష ప్రత్యంగీరా హోమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి హోమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డితో అడిషనల్ డీసీపి వెంకట రమణ తో పాటు బీఆర్ఎస్ నాయకులు కందాడి శ్రీకాంత్ రెడ్డి, జలాల్‌పురం సుధాకర్ రెడ్డి, చీర్యాల మాజీ సర్పంచ్ ధర్మేందర్, ఉపసర్పంచ్ తిరుమల్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త జయరాంరెడ్డి సహా పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. హోమ మహోత్సవం అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**అవకతవకలకు పాల్పడిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: ఆర్.కృష్ణయ్య**

**ముద్ర, హైదరాబాద్:** అవకతవకలకు పాల్పడిన ఇంజనీరింగ్ కళాశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. కొన్ని కళాశాలలు చేసిన అక్రమాల కారణంగా అన్ని కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను నిలిపివేయడం సరికాదన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అబిడ్స్ నుంచి చేపట్టిన 'చలో సెక్రటేరియట్' ర్యాలీలో ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. రాకేష్ దత్త, రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని పోలీసులు బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద అడ్డుకున్నారు.ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, బడుగు వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ కళాశాలల్లో 50 శాతం సీట్లు కూడా భర్తీ కాలేదన్నారు.అవకతవకలకు పాల్పడిన కళాశాలల గుర్తింపును రద్దు చేసి, తప్పు చేయని మిగతా కళాశాలలకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని, బకాయిలను విడుదల చేయడంతో పాటు గతంలో అమలైన విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో జయంత్ యాదవ్, సాయి ఈశ్వర్ శివకృష్ణ, వేముల నవీన్ సాగర్, సాయి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

**ఎమ్మెల్యే యాదయ్య.**

**ముద్ర, చేవెళ్ల :** ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శనివారం రోజు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమము స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మధుసూదన్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని కొనియాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కష్టపడి పనిచేసే పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఉత్తమంగా విద్యను బోధించే వారికి ఇలాంటి పురస్కారాలు దక్కుతాయని ప్రతి ఒక్క ఉపాధ్యాయులు పురస్కారాలు పొందేందుకు కృషి చేయాలని అన్నారు. మండల స్థాయి కాకుండా జిల్లా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు పొందడానికి కృషి చేయాలని తెలిపారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 11 మందికి, జిల్లాస్థాయిలో ఉత్త ఉపాధ్యాయులుగా పురస్కారాన్ని అందుకున్న ఐదు మంది ఉపాధ్యాయులకు వారు సన్మానం చేశారు. ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ పిఆర్టియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి ఎస్ టి యు రాష్ట్ర బాధ్యులు కృష్ణారెడ్డి పిఆర్టియు మండల అధ్యక్షులు డేవిడ్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కృష్ణ మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సీఐఐ జాతీయ అవార్డుల్లో దక్షిణ మధ్య రైల్వే సత్తా

**కాచిగూడ రైల్వే స్టేషన్‌కు 'అత్యుత్తమ ఇంధన సామర్థ్య యూనిట్' అవార్డు**

**ముద్ర, హైదరాబాద్:** 27వ సీఐఐ నేషనల్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్–2026లో దక్షిణ మధ్య రైల్వే పలు అవార్డులను సొంతం చేసుకుంది. ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించడం, ఇంధన పరిరక్షణ చర్యలను అమలు చేయడంలో దక్షిణ మధ్య రైల్వే చేస్తున్న నిరంతర కృషికి గుర్తింపుగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఈ అవార్డులను అందించింది.సెప్టెంబర్ 18న హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్‌లో అవార్డులను ప్రదానం చేశారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు 'అత్యుత్తమ ఇంధన సామర్థ్య యూనిట్' అవార్డు లభించింది.అలాగే లేఖా భవన్, లాలాపూర్‌లోని సెంట్రల్ హాస్పిటల్, మౌలాలి జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (జెడ్ఆర్‌టీఐ), రైల్ బోగీ కర్మానా/యార్డ్గిర్, సిగ్నల్ అండ్ టెలికాం వర్క్‌షాప్/మెట్టుగూడలకు 'ఇంధన సామర్థ్య యూనిట్లు' అవార్డులు లభించాయి.ఈ అవార్డులను హైదరాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ రామారావు, ఇతర సీనియర్ రైల్వే అధికారులు అందుకున్నారు.దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని డివిజన్లు, వర్క్‌షాపులు, వివిధ విభాగాల ఫీల్డ్ యూనిట్లు ఇంధన సామర్థ్యం, ఇంధన పొదుపు, పర్యావరణ అనుకూల కార్యక్రమాల అమలులో చేస్తున్న కృషికి ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైల్వే కార్యకలాపాల్లో సుస్థిర పద్ధతులను ప్రోత్సహించేందుకు చేపడుతున్న చర్యలకు ఇవి నిదర్శనమని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అవార్డులు సాధించిన రైల్వే బృందాన్ని అభినందించారు. జాతీయ స్థాయి గుర్తింపు సాధించడంలో కృషి చేసిన ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఇతర అధికారులను ప్రశంసించారు. ఇంధన పరిరక్షణ, సమర్థవంతమైన ఇంధన నిర్వహణకు దక్షిణ మధ్య రైల్వే కట్టుబడి ఉందని పేర్కొన్నారు.




## రహదారి విస్తరణ పనుల పరిశీలన



**ముద్ర, శేరిలింగంపల్లి:** చందానగర్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి 65 లోని శ్రీదేవి థియేటర్ రోడ్డు నుండి అమీన్ పూర్ వరకు రూ. 45 కోట్ల రూపాయల అంచనావ్యయం తో నూతనంగా చేపట్టబోయే 2.7 కిలోమీటర్ల పొడవుతో నాలుగ లేన్ల రహదారి విస్తరణ మరియు రెండు లేన్ల సర్వీస్ రహదారి విస్తరణ పనులను ఎంపీ రఘునందన్ రావు, పీఏసీఎస్ ఛైర్మన్ అరెకపూడి గాంధీ, సీఎంసీ కమిషనర్ సృజన, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలేం పాటి తదితరులు పరిశీలించారు.రహదారి విస్తరణ పనులలో భాగంగా జాతీయ రహదారి నుండి శ్రీదేవి థియేటర్ రోడ్డు కు కలిపే లింక్ రోడ్డు ను మరియు నాలా పై నిర్మిస్తున్న బాక్స్ కల్వర్టు నిర్మాణం పనుల లో వేగం పెంచాలని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అదేవిదంగా నీటి ప్రవాహం సాఫీగా సాగేలా బాక్స్ కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా బాక్స్ కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, లింక్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, పనులలో అలసత్వం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని తెలియచేశారు.

## శిల్పారామంలో పూంపుహార్ 'మెగా హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో'

**ప్రారంభించిన తమిళనాడు మంత్రి పి.మధన్ రాజా**

**ముద్ర, హైదరాబాద్:** తమిళనాడు హస్తకళల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ శిల్పారామంలో 'పూంపుహార్ మెగా హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో' శనివారం ప్రారంభమైంది. తమిళనాడు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి పి. మధన్ రాజా ప్రదర్శనను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమిళనాడులోని వివిధ జిల్లాలకు చెందిన నైపుణ్యం కలిగిన కళాకారులు రూపొందించిన విభిన్న హస్తకళా ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. తమిళనాడుకు చెందిన వైవిధ్యమైన సంప్రదాయ హస్తకళా వారసత్వాన్ని హైదరాబాద్ ప్రజలకు పరిచయం చేయడమే ఎక్స్‌పో ఉద్దేశమని వివరించారు.సెప్టెంబర్ 19 నుంచి 23 వరకు శిల్పారామంలో ఈ ప్రదర్శన కొనసాగనుంది. కాంస్య విగ్రహాలు, ఇత్తడి సంప్రదాయ దీపాలు, తంజావూరు చిత్రాలు, తంజావూరు కళా పళ్లాలు, పేపియర్–మాచే బొమ్మలు, చెక్క, రాతి శిల్పాలు, ఇత్తడి కళాఖండాలు, మట్టి, టెర్రకోట ఉత్పత్తులు ప్రదర్శనలో ఉన్నాయి.అలాగే కేన్ ఫర్నిచర్, అరటి నార, జనపనార, తాటి ఆకులతో తయారు చేసిన ఉత్పత్తులు, ఫ్యాషన్ ఆభరణాలు, ధూప ద్రవ్యాలు, సుగంధ ద్రవ్యాలు, చేతితో తయారు చేసిన వస్త్రాలు, చేనేత ఉత్పత్తులు తదితర అనేక సంప్రదాయ హస్తకళా వస్తువులు కొనుగోలుకు అందుబాటులో ఉంటాయని పూంపుహార్ అసిస్టెంట్ మేనేజర్ (సేల్స్) సి. గోపికన్నన్ తెలిపారు.కార్యక్రమంలో తమిళనాడు హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. అమృత జ్యోతి, అసిస్టెంట్ మేనేజర్ (సేల్స్) సి. గోపికన్నన్ తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం వసతులు కల్పించాలి



**ముద్ర, కూకట్పల్లి :** జవాహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం )లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల సౌకర్యార్థం విశ్వవిద్యాలయ సెంట్రల్ లైబ్రరీని 24 గంటలూ అందుబాటులో ఉంచాలని, అలాగే యూనివర్సిటీ మైదానంలో ఫిజికల్ టెస్ట్‌లకు కావలసిన వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ 'స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం' నాయకులు శనివారం వినతిపత్రం సమర్పించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆస్కాని జయలక్ష్మి అందుబాటులో లేకపోవడంతో ఆమె కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు దుర్గా ప్రసాద్, సాగర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం క్యాంపస్‌లో వందలాది మంది విద్యార్థులు తెలంగాణ పోలీస్ SI, కానిస్టేబుల్, TGPSC, UPSC, SSC, RRB మరియు బ్యాంకింగ్ వంటి పలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. విద్యార్థులు రోజువారీ తరగతులు, ల్యాబ్స్ పూర్తయిన తర్వాత కూడా ప్రశాంతంగా చదువుకోవడానికి లైబ్రరీని 24 గంటలు తెరచి ఉంచాలని కోరారు. అలాగే లైబ్రరీలో పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రామాణిక పుస్తకాలు, రీజనింగ్, ఆప్టిట్యూడ్, జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్ మెటీరియల్ మరియు గతేడాది ప్రశ్నపత్రాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.పోలీస్ నియామకాల్లో రాత పరీక్షతో పాటు Physical Efficiency Test (PET) కూడా కీలకమైనందున, విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా యూనివర్సిటీ గ్రౌండ్‌లోనే తగిన సదుపాయాలు కల్పించాలని కోరారు. రన్నింగ్ ట్రాక్‌ను శుభ్రపరచడంతో పాటు లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్ ప్రాక్టీస్ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఈ సమస్యలపై వైస్ ఛాన్సలర్ (VC) టీకేకే రెడ్డి గారితో చర్చించి త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో SPF ప్రతినిధులు జయరాం, రాజ్ కుమార్, ఆనంద్ కుమార్, సాయి తనూజ్, ఆదిత్య, శ్రీనికేతన్, ప్రణయ్, చక్రవర్తి, కార్తికేయ, స్టాలిన్, హరికృష్ణ, అక్షిత్, రోహిత్, సోహన్, రోనిత్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని ఆత్మహత్య



**ముద్ర, చేవెళ్ళ:** చక్కగా చదువుకోవాలి అందరూ మెచ్చే విధంగా పనిచేసుకొని జీవించాలి అని తండ్రి మందలించినందుకు ఓ కొడుకు పోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రోజు మండలంలోని అంతారం గ్రామంలో చోటుచేసుకుంది. షాబాద్ ఎస్సై చెన్నారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అంతారం గ్రామానికి చెందిన జెట్ట లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు చంద్రశేఖర్ (16) 9వ తరగతి వరకు చదివి చదువు మానేసి అన్నాతండ్రితో కలిసి వ్యవసాయ పనులు గొర్రెల కాపరుగా ఉంటున్నాడు. శనివారం రోజు లక్ష్మయ్య చంద్రశేఖర్ తో వ్యవసాయపరులకు సరిగ్గా వెళ్లడం లేదు గొర్రెల వద్దకు సరిగా వినడం లేదు చదువుకోమంటే చదువు మధ్యలో ఆపేశావు. ముందు ముందు ఏం చేసుకుని బతుకుతావని ఉదయం ఎనిమిది గంటల సమయంలో మందలించాడు. దానితో ఇంట్లోంచి కోపంతో వెళ్లిన చంద్రశేఖర్ మధ్యాహ్నం వరకు ఇంటికి రాలేదు దానితో వారు అనుమానంతో షాబాద్ పోలీసులకు తెలిపారు. ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు కుటుంబీకులకు ఒక ప్రాంతాన్ని గుర్తించి తెలియజేశారు. ఆ ప్రాంతంలోనే కుటుంబీకులు వెతగ్గా ఒక చెట్టుకు ఊరికి పోసుకొని చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి లక్ష్మయ్య ఇతని ఆత్మహత్య కు ఎలాంటి అనుమానం లేదని మంచి చెప్పినందుకే ఇలా చేసుకున్నాడని తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెన్నారెడ్డి తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 20.09.2026
www.mudranews.in | @mudranews



## సహజ ఆహారం.. కానీ అతిగా కాదు

పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పెరుగు వంటి పోషక ఆహారాలను సమతుల్యంగా తీసుకోవడం జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. అయితే అల్సర్, తీవ్రమైన కడుపునొప్పి లేదా తరచూ మంట వంటి సమస్యలు ఉంటే కేవలం ఇంటి చిట్కాలపై ఆధారపడకుండా వైద్యుడిని సంప్రదించాలి. ముఖ్యంగా మజ్జిగను రెండు గంటలకు ఒకసారి 8 గ్లాసుల చొప్పున తాగడం వంటి అతిగా తీసుకునే సూచనలకు వైద్య ఆధారం లేకపోవచ్చు.



## వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలక పాత్ర: భట్టి



**ముద్ర, హైదరాబాద్:** 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 'వికసిత్ భారత్ దిశగా ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను దాదాపు 5 శాతం నుంచి 10 శాతానికి పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ రుణాలపై ఆధారపడకుండా ప్రైవేట్, సంస్థాగత పెట్టుబడులు, పీపీపీ, గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ ద్వారా వనరుల సమీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. CURE–PURE–RARE విధానంతో రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య అభివృద్ధి చేపడుతున్నామని, 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని, నైపుణ్యాభివృద్ధికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు భట్టి పేర్కొన్నారు.

## సమస్యలు పరిష్కారం కాని సమీక్ష సమావేశాలు ఎందుకు?

* చిగురుమామిడి మండల స్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశంలో సర్పంచుల ఆగ్రహం..
* వైద్య,విద్యుత్ సమస్యలపై ప్రజాప్రతినిధుల ఆవేదన...





**ముద్ర చిగురుమామిడి:** మండల కేంద్రంలో నిర్వహించిన చిగురుమామిడి మండల స్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశం ప్రజాప్రతినిధుల నిలదీతలు,ఆవేదనల మధ్య సాగింది.ప్రజా సమస్యలు ప్రస్తావించినా అధికారులు స్పందించకపోవడంపై సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.సమస్యలు పరిష్కారం కాని ఇలాంటి సమావేశాలు ఎందుకు..? అంటూ అధికారులను నిలదీశారు.ఈ సమావేశంలో ముఖ్యంగా విద్యుత్ శాఖ తీరుపై సర్పంచులు మార్క రాజకుమార్ గౌడ్,కాటం సంపత్ రెడ్డి,జంగా శిరీష రెడ్డి,ఒంటెల కిషన్ రెడ్డి, గునుకుల మధుసూదన్ రెడ్డి,సాంబారి భారతమ్మ,సన్నీళ్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.అదేవిధంగా, వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఉల్లంపల్లి సర్పంచ్ అలువాల శంకర్ తీవ్రంగా నిలదీశారు .గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వైద్యశాఖాధికారుల్లో చలనం లేదని రేకొండ సర్పంచ్ అల్లెపు సంపత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేకొండ గ్రామంలో ఎదురవుతున్న సమస్యలపై ఆ గ్రామ సర్పంచ్ ఆల్లెపు సంపత్ సమావేశంలో తన ఆవేదనను వెళ్లగక్కారు.రేకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం ఆసుపత్రి భవనం సైతం శిథిలావస్థకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు.తక్షణమే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.రేకొండ గ్రామానికి సరైన రవాణా సౌకర్యం లేదని, తక్షణమే బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులు,ప్రజల ఇబ్బందులను తీర్చాలని కోరారు.అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం నిత్యం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.ప్రజా ప్రతినిధులు తెలిపిన సమస్యలను స్వతరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,మండల స్పెషల్ ఆఫీసర్ చత్రు నాయక్, ఎంపీడీవో రామ్మోహన్ చారి, తహసిల్దార్ కనకయ్య, సింగిల్విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,పలు గ్రామాల సర్పంచులు అకవరం భవాని, చింతపూల నరేందర్,బోయిని రమేష్,పీచు సత్యనారాయణ రెడ్డి,గోగూరి లక్ష్మి,తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో మొదలైన మహిళల టీ-20 క్రికెట్ సందడి

**ఏసీఏ క్రికెట్ స్టేడియంలో డబ్ల్యూఏపీఎల్ ను ప్రారంభించిన నారా బ్రాహ్మణి**
**డబ్ల్యూఏపీఎల్ కు బ్రాండ్ అంబాసిడర్ గా మిథాలీ రాజ్**
**డబ్ల్యూఏపీఎల్ ట్రోఫీని ఆవిష్కరించిన నారా బ్రాహ్మణి, మిథాలీ రాజ్**




**ముద్ర, మంగళగిరి:** మహిళా యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (WAPL) సీజన్–1 శనివారం మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రారంభమైంది. హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి లీగ్‌ను లాంఛనంగా ప్రారంభించి, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌తో కలిసి ట్రోఫీని ఆవిష్కరించారు. WAPLకు మిథాలీ రాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. నాలుగు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో ఏడు రోజుల పాటు 13 మ్యాచ్‌లు జరగనున్నాయి. యువ మహిళా క్రికెటర్లకు WAPL మంచి వేదికగా నిలుస్తుందని నారా బ్రాహ్మణి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ మెంబర్ డి.విష్ణుతేజ, ఏసీఏ క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ కల్యాణ్ కృష్ణ, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ వైఎస్ రంగనాథ్ పాల్గొన్నారు.

# హాస్టళ్లలో నిర్లక్ష్యానికి తావులేదు : మంత్రి అడ్లూరి

**విద్యార్థుల భద్రత, భోజన నాణ్యతపై ప్రత్యేక నిఘా**
**కలెక్టర్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యవేక్షణ..**
**డైట్ అమలులో రాజీ వద్దు**
**విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలి**
**అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలపై ఆరా..**
**పారిశుద్ధ్య సిబ్బందికి సముచిత వేతనాలపై ప్రతిపాదనలు**
**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, హైదరాబాద్:** సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. డైట్ అమలులో ఎలాంటి రాజీ ఉండకూడదని, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి తనిఖీలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. సచివాలయంలో శనివారం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పరిధిలోని హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, దివ్యాంగుల వసతి సదుపాయాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, నిత్యావసర సరుకుల నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, భవనాల నిర్వహణ, బెడ్డింగ్ తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీలు కేవలం రికార్డులకే పరిమితం కాకుండా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందుతున్నదీ లేదో పరిశీలించాలని, లోపాలు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు వైద్య సేవలు, బాలికల హాస్టళ్లలో పారిశుద్ధ్యం, శానిటరీ సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు.

అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు సకాలంలో అందుతున్నాయా అనే విషయంపై మంత్రి ఆరా తీశారు. పారిశుద్ధ్య సిబ్బందికి తక్కువ వేతనాలు అందుతున్నాయన్న ఫిర్యాదులపై సముచిత వేతనాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు, బెడ్డింగ్, ఇతర సామగ్రి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థుల భద్రతతో పాటు విద్యా పురోగతి, క్రీడలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయక పరికరాలు, అనుకూల వసతులు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజా, ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ (ఎఫ్ఏసీ) శ్రీధర్, టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి సీతాలక్ష్మి, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి (ఎఫ్ఏసీ) శ్రీమతి కంభంపాటి శారద, ఎస్సీ అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, ఓఎస్డీ వై.జె. విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ భవనం కూల్చివేతకు సిద్ధం..

**- మన్నెంపల్లి గ్రామంలో ఉద్రిక్తత**



**ముద్ర, మానుకొండూరు:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో పాత గ్రామపంచాయతీ భవనాన్ని కూల్చేందుకు వచ్చిన అధికారులు, స్థానిక సర్పంచ్, పాలకవర్గం సభ్యుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నోటీసులు ఇవ్వకుండా అకస్మాత్తుగా కూల్చివేతకు రావడంతో సర్పంచ్ సునీత, పాలకవర్గం సభ్యులు అధికారులను అడ్డుకున్నారు. ప్రొసీజర్ పాటించకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని సర్పంచ్ సునీత ఆరోపించారు. తిమ్మాపూర్ సర్కిల్ పోలీసుల భారీ బందోబస్తు మధ్య అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారులు, పాలకవర్గం సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని అధికారులు వాదించగా, పాలకవర్గం సభ్యులు గతంలోనే ఈ పాత కార్యాలయాన్ని కూల్చవద్దని, గ్రామపంచాయతీ ఇతర అవసరాలకు వాడుకోవాలని చెప్పినట్లు వివరించారు.మానుకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికార బలంతోనే ఈ కూల్చివేత చర్యలు జరుగుతున్నాయని పాలకవర్గం సభ్యులు విమర్శించారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# హైదరాబాద్‌లో 20వ రోజ్‌గార్ మేళా

**నియామక పత్రాలు అందుకున్న 221 అభ్యర్థులు**




**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇనిస్టిట్యూట్‌లో 20వ రోజ్‌గార్ మేళాను కేంద్ర హోం వ్యవహారాల సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. హైదరాబాద్ జోన్ సెంట్రల్ టాక్స్, కస్టమ్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 221 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఈ రోజ్‌గార్ మేళాలో 51 వేల నియామక పత్రాలను అందించినట్లు బండి సంజయ్ తెలిపారు. ఇప్పటివరకు జరిగిన 19 రోజ్‌గార్ మేళాల్లో 12.75 లక్షల నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించే లక్ష్యంతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన వారు అంకితభావంతో పనిచేసి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు.

హైదరాబాద్ జోన్ సెంట్రల్ టాక్స్, కస్టమ్స్ చీఫ్ కమిషనర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. కొత్తగా నియమితులైన 221 మంది అభ్యర్థులకు ఎన్ఏసీఐఎన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జీఎస్టీ, కస్టమ్స్, సంబంధిత చట్టాలు, కార్యాలయ విధానాలతో పాటు ఇన్‌స్పెక్టర్లకు తెలంగాణ పోలీసు అకాడమీ సహకారంతో ప్రత్యేక ఆయుధ నైపుణ్య శిక్షణ అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్



**ముద్ర, మెదక్** : రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులకు సాయమందించి కేంద్ర మంత్రి బండి సంజయ్(Bandi Sanjay) మానవత్వం చాటుకున్నారు. రాజీవ్ రహదారిలో ఓ కారు సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. భర్త డ్రైవింగ్ చేస్తుండగా.. భార్య ముందు సీట్లో, కుమార్తె వెనుక సీట్లో కూర్చున్నారు. ప్రమాద సమయంలో ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో దంపతులకు ప్రాణాపాయం తప్పింది. వెనుక సీట్లో ఉన్న కుమార్తె తల, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళ్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రమాదాన్ని గమనించి.. వెంటనే తన వాహనాన్ని నిలిపి భద్రతా సిబ్బందితో కలిసి కారు వద్దకు వెళ్లారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీసేందుకు సహకరించారు. తీవ్రంగా గాయపడిన కుమార్తెతో పాటు ఆమె తల్లిదండ్రులను తన భద్రతా సిబ్బంది వాహనంలో వెంటనే ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర మంత్రి సూచించారు.

## వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు పేర్లు సూచించిన సందీప్‌రెడ్డి వంగా

**ముద్ర, వరంగల్:** వరంగల్ మామునూరు విమానాశ్రయానికి పేరు సూచించాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన పిలుపుకు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా స్పందించారు. తన సొంతూరైన వరంగల్‌కు అంతర్జాతీయ విమానాశ్రయం రాబోతుండటం సంతోషంగా ఉందని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. విమానాశ్రయానికి 'రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (RIA)', 'కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (KIA)' పేర్లను సూచించారు. వరంగల్ ఘనమైన వారసత్వం, సాంస్కృతిక స్ఫూర్తిని ప్రతిబింబించే పేరును పెట్టడం అర్థవంతంగా ఉంటుందని తెలిపారు. విమానాశ్రయం కలను సాకారం చేసేందుకు కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# ఎరువుల సమతుల్య వినియోగంపై దృష్టి పెట్టాలి

**అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు**

**ముద్ర, హైదరాబాద్**: దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో చర్చించిన అంశాల నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఎరువుల సమతుల్య వినియోగం, పప్పుధాన్యాలు, విత్తనాల లభ్యత, వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (AIF), పురుగుమందుల నాణ్యత, ప్రకృతి వ్యవసాయం, రైతు నేస్తం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.తెలంగాణలో ఎరువుల వినియోగంలో తీవ్ర అసమతుల్యత ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో N:P నిష్పత్తి 14.9:5.7:1గా ఉండగా, ఆదర్శ నిష్పత్తి 4:2:1 మాత్రమేనని తెలిపారు. హెక్టారుకు యూరియా వినియోగం 217 కిలోలుగా ఉందని, ఇది జాతీయ సగటు 160 కిలోల కంటే ఎక్కువని పేర్కొన్నారు. సూక్ష్మ పోషకాలు, జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, ఫెర్టిగేషన్ వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు.పప్పుధాన్యాల సాగు విస్తీర్ణంలో 127 శాతం లక్ష్యాన్ని సాధించినందుకు అధికారులను అభినందించిన మంత్రి.. ధృవీకరించిన విత్తన ఉత్పత్తి, పంపిణీలో పురోగతి తక్కువగా ఉందని గుర్తించారు. రబీ సాగుకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.

నకిలీ, నాసిరకం ఎరువులు, పురుగుమందులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నమూనాల సేకరణ నుంచి కోర్టు కేసుల వరకు ప్రక్రియను డిజిటల్‌గా ట్రాక్ చేసే విధానం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. AIF నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి కూల్‌చెయిన్లు, పప్పు, నూనె మిల్లులను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని మార్కెట్‌తో అనుసంధానించాలని, క్లస్టర్ నుంచి సర్టిఫికేషన్, FPO, ప్రాసెసింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ వరకు సమగ్ర విధానాన్ని అవలంబించాలని మంత్రి తెలిపారు. రాష్ట్ర, కేంద్ర వ్యవసాయ పథకాలపై రైతులకు గ్రామస్థాయిలో సులభమైన తెలుగులో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 20.09.2026
www.mudranews.in | @mudranews



## టీ, కాఫీలను పరిమితం చేయాలి

కడుపులో మంట, యాసిడ్ రిఫ్లక్స్ సమస్యలు ఉన్న కొందరికి టీ, కాఫీ వంటి కెఫీన్ పానీయాలు ఇబ్బందిని పెంచవచ్చు. అందుకే వీటిని అధికంగా తీసుకోకుండా పరిమితం చేయడం మంచిది. ఏ ఆహారం వల్ల మంట పెరుగుతుందో గమనించి దానిని తగ్గించడం కూడా ఉపయోగకరం.



## సోమవారం జిల్లా ప్రజావాణి రద్దు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 19 :** కలెక్టరేట్ వేదికగా ఈ నెల 21న నిర్వహించాల్సిన జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య పరిపాలనా కారణాల రీత్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే డివిజన్, మండల స్థాయిలలో జరిగే ప్రజావాణి కార్యక్రమాలు యథావిధిగా సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. వినతులు సమర్పించేందుకు వచ్చే ప్రజలు ఈ మార్పును గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి



**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మోత్కూర్ వినియోగదారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పోచం సోమయ్య, మున్సిపల్ అధ్యక్షులు మహ్మద్ రఫీ లు మున్సిపల్ కమిషనర్ జి నర్సయ్య కు వినతి పత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మోత్కూర్ మున్సిపల్ పరిధిలో పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన మాంసం కోసం వెటర్నరీ డాక్టర్ సర్టిఫై చేసిన తర్వాతనే మాంసం విక్రయించాలని కొంతమంది వ్యాపారస్తులు లాభ పేక్షతో నాణ్యతలేని రోగాల బారిన పడ్డ జంతువులను కోసి వినియోగదారులకు మాంసం విక్రహిస్తు ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తున్నారని ఆరోపించారు.తక్షణమే మున్సిపల్ ఆధ్వర్యంలో వెటర్నరీ డాక్టర్ తో సర్టిఫై చేయుటకు తగిన ఏర్పాట్లు చేయాలని . మున్సిపల్ పరిధిలో కాపల లేని మేకలు, పందులు, కుక్కలను కట్టడి చేయుటకు వాటి యజమానులకు నోటీసులు పంపి వాటివల్ల వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పసల ప్రతాప్, ప్రధాన కార్యదర్శిలు నిలిగొండ సైదులు, సొల్లేటి సోమేశ్వర్లు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవం




**ముద్ర, మోత్కూర్ :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరుతూ మోత్కూర్ పట్టణంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మోత్కూర్ మండల కార్యదర్శి జిట్టా గౌతం మాట్లాడుతూ, ఈ నెల 28, 29, 30 తేదీల్లో హనుమకొండ లో ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.దేశంలోనే మొట్ట మొదటి విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, తెలంగాణ ఉద్యమంలోనూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 90 సంవత్సరాలుగా విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపుతున్న సంఘంగా ఏఐఎస్ఎఫ్ కొనసాగుతోందని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని వారు విమర్శించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉలన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఈ వేడుకల స్ఫూర్తితో భవిష్యత్తులో విద్యారంగ సమస్యలపై మరింత రెట్టింపు ఉత్సాహంతో పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో భీమవరపు వంశీ ,సువ్వి కరుణాకర్,చింటూ తదితరులు పాల్గొన్నారు.

# గణనాథునికి ఘనంగా పూజలు







**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని గణేష్ మండపాలను ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద భక్తుల రద్దీ, భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడి, ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు. అనంతరం గణేష్ మండపం వద్ద నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాలు, రాబోయే నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపడుతోందని ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను జరుపుకుందాం పరస్పర సహకారంతో శాంతిభద్రతలను కాపాడుకుందామని, గణనాథుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం వెల్లివిరియాలన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పోలీసు శాఖ సూచనలు, భద్రతా నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు.

**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మండలం పనకబండ గ్రామం లో భీమాసేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వేద పండితులు శివానంద శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

**గణపయ్యకు నవ ధాన్యాలతో అలంకరణ**
**ముద్ర,మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ లోని గడి బజారులో స్నేహ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడిని నవధాన్యాలతో అలంకరించారు. నవధాన్యాలతో అలంకరించిన శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీ నరసింహ రెడ్డి, చేనేత సహకార సంఘం అధ్యక్షులు వంగరి రాములు, చేనేత సహకార సంఘం కోషధికారి పోచం కన్నయ్యలు స్వామి వారిని దర్శించుకున్నారు కమిటీ సభ్యులు శ్రావణ్, వరుణ్ ప్రసాద్, ఆసిఫ్ ,సుజన్ వరుణ్, ఇర్ఫాన్ ,రిత్విక్ తదితర భక్తులు పాల్గొన్నారు

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు

**ముద్ర, బీబీనగర్ :** వినాయక నిమజ్జనం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను శనివారం బీబీనగర్ చెరువు లో జిల్లా అదనపు ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా బీబీనగర్ చెరువును సందర్శించి నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భద్రత, పారిశుద్ధ్యం, లైటింగ్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అవసరమైన క్రెన్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్ సుందర్ ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్, ఎస్ఐ పాల్గొన్నారు.





**ఖమ్మం జిల్లాలో..**
**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 19:** జిల్లాలో గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ధంసలాపురం చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమీషనర్ సునీల్ దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చెరువు వద్ద బారికేడింగ్, రాత్రి వేళల్లో తగిన లైటింగ్, తాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుధ్య చర్యలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ మళ్లింపులు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు.నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు, మెకానిక్ లు, బోట్లు సిద్ధంగా ఉంచాలని, రక్షణ చర్యల్లో భాగంగా షిఫ్టుల వారీగా గజ ఈతగాళ్లను నియమించాలని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తయ్యేలా ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు, జిల్లా యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యను కాషాయికరణ చేసే కుట్ర

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 19 :** ఏఐఎస్ఎఫ్ జిల్లా 28వ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశంలో విద్య కాషాయికరణ ప్రమాదంలో పడిందని, పసిమెదళ్లలో మతోన్మాదాన్ని నింపుతూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గాయని, ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లింపుల్లో వైఫల్యం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకు




దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా విఫలమైందని విమర్శించారు. విద్యారంగ, సామాజిక సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ విద్య అంగడి సరుకుగా మారిందని, పోరాటాల ద్వారానే పరిష్కారం సాధ్యమని పిలుపునిచ్చారు. మహాసభల్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఇంచార్జి రావిశివరామకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అజిత్ తదితరులు పాల్గొన్నారు.తొలుత నెహ్రూ నగర్ నుంచి ఐఎంఏ హాల్ వరకు విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు.

# ఉచితంగా మానసిక, వ్యసన విముక్తి వైద్య సేవలు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 19 :** జిల్లా సర్వజన ఆసుపత్రి కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఉచితంగా మానసిక వైద్య సేవలు అందిస్తూ బాధితుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక పర్యవేక్షణలో సాగుతున్న ఈ విభాగం, సాధారణ మానసిక రుగ్మతల నుండి వ్యసన విముక్తి, చట్టపరమైన సంరక్షణ వరకు ఎన్నో విభిన్న వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. మాతా-శిశు మానసిక ఆరోగ్యం, బాల్యము నుండి వృద్ధాప్యం వరకు తలెత్తే రకరకాల మానసిక సమస్యలకు ఇక్కడ సంపూర్ణ చికిత్స అందిస్తున్నారు. ప్రతినెల సుమారు 300 వరకు కేసులు నమోదవుతుండగా, వ్యాధి తీవ్రతను బట్టి వైద్యులు సుదీర్ఘ కాలపరిమితితో చికిత్సలు చేపడుతున్నారు.మద్యం, పొగాకుతో పాటు గంజాయి, ఓపియాయిడ్ వంటి మాదక ద్రవ్యాల బారిన పడిన వారికి ఇక్కడ పునరావాస సేవలు అందుతున్నాయి. సాధారణ డి-ఎడిక్షన్ విభాగంలో నెలకు దాదాపు 60 మందికి పునరావాసం కల్పిస్తూ వ్యసనాల నుండి స్వేచ్ఛ ప్రసాదిస్తున్నారు. వైద్య-న్యాయ సంబంధిత విభాగంలో మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారికి 8 వారాల పాటు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చి, ర్యాపిడ్ డ్రగ్ ప్యానెల్




టెస్టింగ్ ద్వారా నెగెటివ్ నివేదికలు వస్తే న్యాయస్థానాల ద్వారా కేసులు కొట్టేసేందుకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రతినెల సగటున ఐదుగురు బాధితులు వ్యసనాల నుండి పూర్తిగా బయటపడి నూతన జీవితాన్ని ప్రారంభించగలుగుతున్నరు.వివక్షకు తావులేకుండా ట్రాన్స్ జెండర్ల కోసం ప్రతి గురువారం ఆసుపత్రిలోని ప్రత్యేక గదిలో రహస్యంగా ఓ.పి నిర్వహిస్తూ చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నారు. అలాగే పోక్సో చట్టం కింద బాధిత బాలబాలికలకు మానసిక స్థితి విశ్లేషణ, వైద్యంతో పాటు న్యాయస్థానాలకు నివేదికలు సమర్పిస్తున్నారు. జైలు నుండి తీసుకొచ్చే ఖైదీలకు మానసిక చికిత్స అందిస్తూ, నేషనల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందేలా చూస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మానసిక స్థితిని పరిశీలించి సర్టిఫికేట్లు ఇవ్వడంతో పాటు, ప్రతినెల 80 నుండి 100 మంది దివ్యాంగులకు వైకల్య శాతాన్ని నిర్ధారించి యుడిఐడి ధృవీకరణ పత్రాలు అందజేస్తున్నారు.వైద్య సేవలకే పరిమితం కాకుండా ఎంబిబిఎస్ విద్యార్థులకు, హౌస్‌సర్జన్లకు క్లినికల్ శిక్షణ ఇస్తూ పీజీ విద్యార్థులకు డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్ ద్వారా ప్రాక్టికల్ నాలెడ్జ్ అందిస్తున్నారు. సమాజంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు అనేక సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పరిమిత సిబ్బందితోనే విశేష సేవలు అందిస్తుండగా, ఇతర శాఖల్లోని సైకియాట్రిక్ వైద్యులను డెప్యుటేషన్‌పై నియమించి ఈ విభాగాన్ని మరింత పటిష్టం చేసేందుకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

## యూనివర్సిటీ క్రీడలలో ద్వితీయస్థానం సాధించిన ఎస్ఎల్ఎన్ఎస్ విద్యార్థులు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఈ నెల 17, 18 వ తేదీ లలో మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర కళాశాలల క్రీడా పోటీలలో స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళాశాలకి చెందిన మహిళా క్రీడాకారులు కబడ్డీ లో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. కళాశాల టీమ్ కు చెందిన ఏ.పూజ, బీకాం మొదటి సంవత్సరం విద్యార్థిని డిసెంబర్ మాసంలో కృష్ణా విశ్వ విద్యాలయం, మచిలీపట్నం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో జరుగు సౌత్ జోన్ టోర్నమెంట్ కు మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం తరపున ఎంపిక కాగా ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ అల్తాఫ్ హుస్సేన్ బహుమతులను అంద జేశారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.ఎన్. వంశ తిలక్ గెలుపొందిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల వ్యాయామ అధ్యాపకులు బి. పాండురంగంని గెలుపొందిన విద్యార్థుల ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ గంజి అభినందించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి. బాల్ రెడ్డి, కె. కిష్టయ్య, ఎన్. సుధ, అతర్ ఫరీన్, సతీశ్, శివ నాగేందర్ పాల్గొని అభినందనలు తెలిపారు.

## ఇండ్ల సమస్యపై భవిష్యత్తు కార్యాచరణ



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 19 :** శ్రీనివాస్ నగర్ ఇండ్ల స్థలాల సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే వరకు పోరాటాలు కొనసాగిస్తామని, ఈ విషయంలో తదుపరి కార్యాచరణ చేపడతామని సీపీఎం పార్టీ నాయకులు స్పష్టం చేశారు. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంతో బాధితులకు ఊరట లభించడంతో ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి గుడి వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ మాట్లాడుతూ, ఒకవైపు ప్రత్యక్ష ఆందోళనలు చేస్తూనే మరోవైపు కోర్టును ఆశ్రయించడంతోనే ఈ తాత్కాలిక ఉపశమనం లభించిందన్నారు.గత 40 ఏళ్లుగా ఇక్కడే నివాసముంటున్న పేద కుటుంబాలకు శాశ్వత హక్కులు కల్పించే వరకు అటు కోర్టులోనూ, ఇటు ప్రజాక్షేత్రంలోనూ పోరాడతామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే ఇతర రాజకీయ పార్టీలు కంటితుడుపు ఆందోళనలు చేస్తున్నాయని, రాజకీయం చేయకుండా నిజాయితీగా పేదల వైపు నిలబడేది కేవలం ఎర్ర జెండాలేనని స్పష్టం చేశారు. స్థానిక నివాసితులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, జిల్లా కలెక్టర్, మంత్రి, కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకుని పేదల ఇళ్లను కాపాడాలని డిమాండ్ చేశారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



**ముద్ర, దేవరకొండ:** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు దేవరకొండ డివిజన్ జర్నలిస్టులు శనివారం సంఘీభావం తెలిపారు. దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు గాదె గిరిధర్ రావు నేతృత్వంలో జర్నలిస్టులు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా గాదె గిరిధర్ రావు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యపై సానుకూలంగా స్పందించి వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని సమస్య పరిష్కారం కాకపోతే దేవరకొండ డివిజన్ స్థాయిలోనూ రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు.సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకంజర్నలిస్టులు తమ వృత్తిని నమ్ముకుని పరిమిత ఆదాయంతో కుటుంబాలను పోషిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని గాదె గిరిధర్ రావు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజా సమస్యలపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. ప్రజల గొంతుకగా, ప్రభుత్వాలను జవాబుదారీగా నిలపడంలో జర్నలిస్టులు ముఖ్య భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది శ్రీనివాస్ రెడ్డి, టీయూడబ్ల్యూజే ఐజేయూ దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు గాదె గిరిధర్ రావు, డివిజన్ ఉపాధ్యక్షుడు ఖాజా మొహినుద్దీన్, కోశాధికారి బూడిద శ్రీనివాస్ యాదవ్, సహాయ కార్యదర్శి ఇలియాస్ బాబా తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు

## మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రదానోత్సవం



**ముద్ర, దేవరకొండ:** నేరేడుగొమ్ము మండల విద్యాధికారి టి బ్రహ్మాచారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులకు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేశారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నది ఉపాధ్యాయులే అని కొనియాడారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని, వారిని సక్రమ మార్గంలో నడిపించే గురువుల సేవ వెలకట్టలేనిదన్నారు.పురస్కారం అందుకున్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి ఈ పురస్కారం అందించడం పట్ల మండల విద్యాశాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తమకు మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి, నేరేడు కొమ్ము కాంప్లెక్స్ హెచ్ఎం, పెద్దమునిగల్ కాంప్లెక్స్ హెచ్ఎం మరియు సంఘ నాయకులు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగతో జీర్ణవ్యవస్థకు మేలు



పలుచటి మజ్జిగలో సహజమైన ప్రొబయోటిక్స్ ఉంటాయి. ఇవి పేగుల్లోని మంచి బ్యాక్టీరియా సమతుల్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మజ్జిగలో కొద్దిగా జీలకర్ర పొడి, కొత్తిమీర, కరివేపాకు కలిపి తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు మేలు కలగొచ్చని నిపుణులు చెబుతున్నారు.

# నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు





### ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

**ముద్ర ప్రతినిధి, మెదక్:** వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. శనివారం నర్సాపూర్‌లోని రాయరావు చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన ప్రాంతంలో భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, బారికేడింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, రాత్రివేళల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలోని శివాజీ యూత్ గణేష్ మండపాన్ని ఎస్పీ సందర్శించారు. మండపం వద్ద నిర్వహిస్తున్న పాయింట్ బుక్‌ను పరిశీలించి, యువతతో మాట్లాడారు. వెంట డిఎస్పీ నరేందర్ గౌడ్, సిఐలు సందీప్ రెడ్డి, రంగా కృష్ణ, ఎస్సై రంజిత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సందర్శన

మెదక్ మండలం కొంటూర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. చెరువు వద్ద నిమజ్జనానికి అనుకూలంగా చేసిన ఏర్పాట్లతోపాటు బారికేడింగ్, విద్యుత్ దీపాలు, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను పరిశీలించారు. నిమజ్జన సమయంలో రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని సూచించారు. వెంట డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ కృష్ణమూర్తి, ఎస్ఐ సుమన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

### మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అబ్దుల్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మైనారిటీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అబ్దుల్ అన్నారు. శనివారం మెదక్ కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, తహసిల్దారులు, మైనారిటీ సంక్షేమ అధికారులతో జిల్లాలో మైనార్టీలకు అమలవుతున్న పథకాలు, షాదీ ముబారక్, కళ్యాణ్ లక్ష్మి, విద్యార్థులకు స్కాలర్షిప్ షాది ఖానాలు సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అబ్దుల్ అమీద్ మాట్లాడుతూ... షాదీ ముబారక్ పథకం లబ్దిదారుల దరఖాస్తులను పరిష్కరించి లబ్ధి చేకూర్చాలన్నారు. మైనారిటీ విద్యార్థుల స్కాలర్షిప్ అందించే విషయంలో ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ముందుకు పోవాలన్నారు. జిల్లా పరిధిలోని మైనారిటీ విద్యాసంస్థలు, వక్ఫ్ భూముల రక్షణకు సంబంధించిన అన్ని విషయాల్లో పురోగతి కనపడాలన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్చార్జి మైనారిటీ సంక్షేమ అధికారి ఉపేందర్, ఆర్డీవోలు రమాదేవి, బాలయ్య, రామకృష్ణ, సంబంధిత తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆ విఘ్నేశ్వరుడి ఉత్సవాలకు 90 ఏళ్లు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయం (సరస్వతి శిశు మందిర్) లో విఘ్నేశ్వరుడి ప్రతిష్ఠ 90 ఏళ్లుగా చేస్తున్నారు. 1936 సెప్టెంబర్ 19 శ్రీ దాత నామ సంవత్సర భాద్రపద శుద్ధ చవితినాడు వినాయక పండగ రోజు వినాయక ఉత్సవాలు ప్రారంభించారు. 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు సాహమూహికంగా భజన కార్యక్రమం నిర్వహించారు. జరిగింది. ఈ కార్యక్రమంలో వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు పనిముక్కల మనోజ్ కుమార్, ప్రధాన ఆచార్యులు ఆనంద్ రెడ్డి, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే భావి తరాల ఆరోగ్యం




**ముద్ర ప్రతినిధి, మెదక్:** పోషక మాసం కార్యక్రమంలో భాగంగా మెదక్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శని వారం హవేలీ ఘనపూర్ మండలం కూచన్ పల్లి పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో పోషన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి నాచారం మధుమోహన్ మాట్లాడుతూ ఆరోగ్య కరమైన పిల్లలతోనే ఆరోగ్యవంతమైన భావిష్యత్, సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఐసీడీసీ అధికారులు, షీ టీం సభ్యులు, మెడికల్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయం కోసం భవనాలు చూడండి



### కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశం

**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలో తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించేందుకు అనువైన పాఠశాల భవనాలను గుర్తించాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ సంతోష్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఎ.ఎ. ఇజ్రాయల్, అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్యతో కలిసి సమీకృత కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా వసతులను పెంచేందుకు క్రమంగా కొత్త విద్యాలయాలను మంజూరు చేస్తోంది. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేసిందని, మెదక్ జిల్లాలో నూతన కేంద్రీయ విద్యాలయం నెలకొల్పేందుకు హవేలీ ఘనపూర్ మండలంలో వైపిఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ సమీపంలో 6 ఎకరాల స్థలాన్ని గుర్తించడం జరిగిందన్నారు. జిల్లాలో కేంద్రీయ విద్యాలయాన్ని తాత్కాలికంగా ప్రారంభించేందుకు అనువైన విద్యాలయ భవన సముదాయాలను గుర్తించాలని, గుర్తించిన వెంటనే కేంద్రీయ విద్యాలయం తాత్కాలికంగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు మెదక్ పట్టణంలో కేంద్రీయ విద్యాలయ నెలకొల్పడానికి భవనాలను పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, గణాంక అధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడి సేవలో కలెక్టర్ దంపతులు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** కలెక్టర్ ప్రతిమా సింగ్ దంపతులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్ పట్టణం నేతాజీ గణేష్ మండలి వద్ద కలెక్టర్ దంపతులు ప్రతిమాసింగ్, శుభం సింగ్, కూతుళ్లు ఏకాంషి, అద్వితతో కలిసి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వాహకులు సత్కరించారు. విఘ్నేశ్వరుని కరుణాకటాక్షాలతో అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో తులతూగాలని సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించినట్లు కలెక్టర్ తెలిపారు. గణేష్ మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థికసాయం



**ముద్ర దేవరకొండ:** చింతకుంట్ల గ్రామానికి చెందిన కుంచం గిరి సన్నాఫ్ వెంకటయ్య గత కొద్ది రోజుల క్రితం దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ నాయక్ క్రషర్ మిల్లు వద్ద బండరాళ్లకు బ్లాస్టింగ్ హోల్ వేస్తున్న సమయంలో కుట్ట పైనుంచి రాయి వచ్చి గిరికాళ్ళకు బలంగా తగలడంతో వెంటనే గిరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్లోని బేగంపేట్ వెల్ నెస్ హాస్పిటల్కి తరలించి వైద్య చికిత్స అందిస్తుండగా గిరి కుడి కాలు తీవ్రంగా దెబ్బతినడంతో కుడికాలను వైద్యులు తొలగించి మరో కాళ్లకు ఆపరేషన్ చేశారు. గిరి కుటుంబం పేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న చింతకుంట్ల గ్రామానికి చెందిన బచ్చనబోయిన జోగయ్య శనివారం హాస్పిటల్లో చికిత్స పొందుతున్న గిరిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సహాయంగా జోగయ్య గిరికి పదివేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించి పెద్ద మనసు చాటుకున్నారు. ఆర్థిక సాయం అందజేసిన జోగయ్యకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నటువంటి గిరిని దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. వీరి వెంట గ్రామ యువకులు కుంచం విష్ణు, శ్రీరాములు, రాజు, నాగార్జునలు ఉన్నారు.

## ఘనంగా రేఖా రెడ్డి జన్మదిన వేడుకలు



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో శనివారం మాజీ ఎంపిపి దూదిపాల రేఖా రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించి ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్ అదిరాల రమేష్ సుమలత, ఉప సర్పంచ్ బచ్చన బోయిన శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు, ఎమ్మార్పిఎస్ అధ్యక్షుడు రమేష్, యువజన సంఘం నాయకులు ఫయాజ్ ,శంకర్, నరసింహ, మహేష్ పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకే సైన్స్ సెమినార్లు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి సైన్స్ సెమినార్లు దోహదపడతాయని జిల్లా విద్యాధికారి ఎస్.రాజు అన్నారు. శనివారం మెదక్ పీఎం శ్రీ తెలంగాణ బాలికల గురకుల పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. "భారతీయ ఇంధన వనరుల సముదాయం 2047– అవకాశాలు సవాళ్లు" అనే అంశంపై విద్యార్థులు వారి యొక్క సెమినార్ పత్రాలను ప్రజెంట్ చేశారు. విజేతలలో మొదటి స్థానం పూజశ్రీ (ముస్లాపూర్), ద్వితీయ స్థానం సిరి మనస్విని (సిద్దార్థ్ రూరల్ హై స్కూల్), తృతీయ స్థానం జయశ్రీ (తెలంగాణ గురుకుల పాఠశాల మెదక్) ప్రథమ స్థానం పొందిన పూజ శ్రీ రాష్ట్రస్థాయి సెమినార్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మండల విద్యాధికారి శంకర్, స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్ కుమార్, సెమినార్ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రభు, లక్ష్మి, స్రవంతిలు పాల్గొన్నారు.

## 0-5 పిల్లలకు బాల ఆధార్ తప్పనిసరి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** 0–5 సంవత్సరాలలోపు పిల్లలకు బాల ఆధార్ తప్పనిసరి అని కలెక్టర్ ప్రతిమసింగ్ సూచించారు. మెదక్ పట్టణంలో రిజిస్ట్రేషన్ ఆఫీస్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి తన పిల్లలు ఏకాంషి, అద్విత ఆధార్ నమోదు చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ 0 నుండి ఐదు సంవత్సరాల పిల్లల ఆధార నమోదులో ఉండాలన్నారు పిల్లల కోసం బాల ఆధార్‌ను యూఐడీఏఐ తీసుకొచ్చింది అని అన్నారు..0 నుండి కేవలం 5 సంవత్సరాల్లోపు పిల్లలకు దీనిని జారీ చేస్తారు. అని వివరించారు.బాల ఆధార్ అనేది నీలి రంగులో ఉంటుందన్నారు. పిల్లలకు ప్రత్యేకంగా జారీ చేసే ఆధార్ కార్డు ఇది. పిల్లలను గుర్తించడంలో ఉపయోగపడుతుందని స్కూల్స్, పాస్ పోర్ట్ దరఖాస్తులు, ప్రభుత్వ స్కీమ్స్, ఇతర సేవలను పొందటంలో సహాయపడుతుంది

## 107 గ్రాముల ఆల్ఫ్రాజోలం స్వాధీనం వ్యక్తి అరెస్ట్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఎక్సైజ్ శాఖ టాస్క్ ఫోర్స్ దాడిలో 107 గ్రాముల ఆల్ప్రాజోలం కల్లులో కలిపే మత్తుమందును స్వాధీనం చేసుకున్నారు. ఈఎస్ నరసింహారెడ్డి డిటిఎఫ్ సిఐ గోపాల్ ఆదేశాల మేరకు పాపన్నపేట మండలం సీతానగర్ గ్రామంలో మాదాస్ రవి వద్ద దాడి చేసి మత్తుమందును సీజ్ చేశారు. రవిని కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో సిబ్బంది జీవన్, పుండరీకం, వహీద్, స్రవంతి పాల్గొన్నారు

# కోదాడ మెగా జాబ్‌మేళాకు పోటెత్తిన యువత

### ఉద్యోగాలు సాధించిన వారికి నియామకపత్రాలు అందజేత



**ముద్ర, కోదాడ, సెప్టెంబర్ 19:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కోదాడలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన లభించింది. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వేలాది మంది యువత తరలివచ్చారు. 350 ప్రముఖ కంపెనీలు పాల్గొని ఐటీ, ఫార్మా, తయారీ, వైద్యం, విమానయానం, బ్యాంకింగ్, రిటైల్, మౌలిక వసతులు తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించాయి.జాబ్‌మేళాకు 53 వేల మందికి పైగా యువత నమోదు చేసుకోగా, వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో పలువురు అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తొలి దశలోనే వందలాది మందికి నియామక పత్రాలు అందజేశారు. అభ్యర్థుల అర్హతలకు అనుగుణంగా స్క్రీనింగ్ పరీక్షలు, సాంకేతిక పరీక్షలు, వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించారు.శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ఏ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువతకైనా ఉపాధి కల్పించాలనే తపనతోనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంత భారీ జాబ్‌మేళాను నిర్వహించారని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ యువతలో ఉన్న ప్రతిభ, ఉద్యోగాలపై ఉన్న ఆకాంక్షలకు జాబ్‌మేళాకు వచ్చిన స్పందనే నిదర్శనమన్నారు. అర్హత కలిగిన ఉద్యోగార్థులకు ప్రముఖ కంపెనీలతో నేరుగా అనుసంధానం కల్పించి, ఉద్యోగ అవకాశాలను వారి ప్రాంతానికి చేరువ చేయాలన్న ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతకు నైపుణ్యాలు అందించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఫ్యూచర్ సిటీని పెట్టుబడులకు కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కోదాడలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించడం సంతోషకరమన్నారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోదాడలో టాస్క్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. యువత నైపుణ్యాలను పెంచి మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.జాబ్‌మేళాను శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. ఎంపికైన యువతకు నియామక పత్రాలు అందజేసి అభినందించారు.యాదాద్రి నుంచి 4,300 మంది హాజరు కోదాడ జాబ్‌మేళాకు యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి 4,300 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిని కోదాడకు తరలించేందుకు ప్రత్యేకంగా 16 బస్సులను ఏర్పాటు చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర విద్యార్హతలు కలిగిన యువత జాబ్‌మేళాలో పాల్గొన్నారు.మొత్తంగా గ్రామీణ ప్రాంతంలో నిర్వహించిన ఈ భారీ నియామక కార్యక్రమం ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. కంపెనీల ఎంపిక, ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఉద్యోగాలు పొందే వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L. N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555